# 40 లక్షల విలువ గంజాయి

**మోతుగూడెం, పెన్ పవర్ ,జూలై 10):** మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు వేర్వేరు కేసుల్లో 800 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్న కేసు వివరాలను చింతూరు ఏ .ఎస్. పి రాహుల్ మినా విలేకరుల సమవేశం లో తెలియజేశారు.రెండు కేసుల్లో స్వాదీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు 40 లక్షల విలువ వుంటుంది అని.గంజాయి తరలించడానికి వాడిన వాహనాలతో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్నటు తెలియజేశారు. ఈ సమావేశంలో చింతూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎమ్. గజేంద్ర కుమార్, మోతూగూడెం ఎస్సై బి.గోపాల్ రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

# మంత్రి నిమ్మలను కలిసిన సత్యనారాయణ



**పోడూరు, పెన్ పవర్, జులై 10:** పాలకొల్లు శాసనసభ్యుడు, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ఆయన కార్యాలయంలో బుధవారం పోడూరు మండల సమన్వయ కమిటీ సభ్యుడు, జిన్నూరు తెదేపా గ్రామ అధ్యక్షుడు భూపతి రాజు సత్యనారాయణ రాజు మర్యాదపూర్వకంగా కలిసినట్లు పాలకొల్లు ఏఎంసి మాజీ డైరెక్టర్, తెదేపా మండల ఉపాధ్యక్షుడు మైగాకుల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. గ్రామంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

# జగ్గంపేటలో వీధి కుక్కలు స్వైర విహారం



- భయాందోళన చెందుతున్న ప్రజలు

**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 10:** జగ్గంపేట పట్టణంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ రోడ్లపై వెళ్లే పాదచారులు, వాహనదారులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. అసలే ఇటీవల రెండు రోజుల క్రితం జగ్గంపేటలోని జాతీయరహదారిపై, అంబేద్కర్ నగర్ తదితర చోట్ల పిచ్చికుక్క స్వైర విహారం చేసి పదిమందిని గాయపరిచింది. దీంతో వారంతా ప్రభుత్వాస్పత్రిలో కుక్కకాటు ఇంజక్షన్లు వేయించుకున్నారు. గ్రామంలో తిరుగుతున్న పిచ్చికుక్కలను గుర్తించి ఇక్కడి నుంచి తరలించాలని లేదా చంపేయాలని కుక్కకాటు బాధితులు తీవ్ర స్థాయిలో ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ పట్టణంలో ఎక్కడపడితే అక్కడ వీధి కుక్కలు తిరుగుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కుక్కలను చూస్తుంటే అల్లంత దూరాన ఉండిపోతున్నారు. ఏది పిచ్చికుక్కో, ఏ కుక్కదాడి చేస్తుందో తెలియక వాటి నుంచి తప్పించుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. అయితే పిల్లలు పాఠశాలలకు వెళ్లి, వచ్చే సమయాల్లో కుక్కలు వెంటపడి దాడి చేస్తాయేమోనని వారి తల్లిదండ్రులు భయపడుతున్నారు. పిల్లలను ఒంటరిగా వదిలేయకుండా పలు జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. పట్టణంలో పిచ్చికుక్కలపై నిఘా పెట్టి వాటిని ఇక్కడి నుంచి తరలించేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఉరుములు మెరుపులతో కూడిన వర్షం

**వై రామవరం,పెన్ పవర్,జూలై 11** :ఉరుములు మెరుపులతో బుధవారం ఒక మోస్తరు వర్షం పడుతుంది.

ప్రతిరోజు ఏదో సమయంలో ప్రతి గ్రామంలో వర్షం కురుస్తూనే ఉందని స్థానికులు తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల ఖరీఫ్ వంటలు వేసుకోవడానికి ఉపయోగపడుతుందని రైతులు అంటున్నారు. వాణిజ్య పంటలైన దుంప, వంగ, మొక్కజొన్న పంటలకు నాటు కోవడానికి అనుకూలంగా ఉందని అంటున్నారు.





# టిడ్కో రుణాలు, రికవరీలకు సంబంధించిన వివరాలు సమర్పించండి

## అధికారులకు కలెక్టర్ ఆదేశం

**కాకినాడ.పెన్ పవర్ జులై 10** :జిల్లాలో టిడ్కో గృహల లబ్ధిదారులకు బ్యాంకుల వారిగా మంజూరు చేసిన రుణాలు, రీకవరీలకు సంబంధించిన వివరాలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్..టిడ్కో గృహల పురోగతిపై టిడ్కో, మెప్మా అధికారులతో సమీక్షించారు. జిల్లాలో మంజురైన టిడ్కో గృహల రిజిస్ట్రేషన్, లబ్ధిదారులకు అప్పగించిన గృహలు, బ్యాంకుల ద్వారా లబ్ధిదారులకు మంజురు చేసిన రుణాలు, వాటి రీకవరీల వివరాలపై జిల్లా కలెక్టర్.. అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 7,288 టిడ్కో గృహలకుగాను 6384 గృహాలు నిర్మాణ పనులు పూర్తి చేసి, ప్రారంభించడం జరిగిందన్నారు. ఇందులో 3,386 గృహాలు రిజిస్ట్రేషన్, తనఖా ప్రక్రియను పూర్తి చేసి ఆయా మున్సిపాలిటీ లబ్ధిదారులకు అందజేసినట్లు కలెక్టర్ తెలిపారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ప్రధానంగా జిల్లాలో టిడ్కో గృహల లబ్ధిదారులకు బ్యాంకుల వారిగా మంజూరు చేసిన రుణాలు, రీకవరీలకు సంబంధించిన వివరాలు సేకరించి నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో టిడ్కో సూపరింటెండెంట్ ఇంజనీర్ బి.శ్రీనివాసరావు, ఈఈ రీటా, మెప్మా పీడీ బి.ప్రియంవద ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జగ్గంపేటలో తాండవిస్తున్న అపారిశుధ్యం





- ఆర్భాటానికే పరిమితమైన "స్టాప్ డయేరియా"

**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 10:** స్టాప్ డయేరియా పేరిట ఈనెల 1వతేదీన ఆర్భాటంగా మండల అధికారులు కార్యక్రమం నిర్వహించారు తప్పితే ఎక్కడా దాని చాయలు కనిపించడంలేదు. గ్రామాల్లో ఎక్కడికక్కడే అపారిశుధ్యం తాండవిస్తుంది. కాలువుల్లో పూడిక నిలిచిపోవడంతో మురికినీరు రోడ్లపై ప్రవహించడం, డ్రైనేజీల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో అక్కడే పందులు దొర్లడం జరుగుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్య వీధుల్లో రోడ్లపైనే చెత్తను వేసున్న సిబ్బంది నామమాత్రంగా తొలగిస్తున్నారే తప్ప పూర్తిస్థాయిలో తొలగించకపోవడంతో ఆప్రాంతమంతా దుర్గందభరితంగా మారుతుంది. ప్రజలకు స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా పరిసరాలు పరిశుభ్రతపై ఎటువంటి అవగాహన కల్పించకపోవడంతో చెత్త తీసుకువచ్చి రోడ్లపై, డ్రైనేజీల పక్కన పోస్తున్నారు. చుట్టు పక్కల మండలాల్లో డయేరియా కేసులు పెరిగి మరణాలు సంభవించిన ఇక్కడ అధికారుల్లో ఎటువంటి చలనం లేదు. ముఖ్యంగా జగ్గంపేటలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. డ్రైనేజీలో నీరు ప్రవహించక అక్కడే నిలిచిపోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు వాపోతున్నారు. జగ్గంపేటలోని విష్ణాలయం దగ్గర నుంచి వినాయకుని గుడి వరకు డ్రైనేజీ వ్యవస్థ తీవ్ర దుర్భరంగా తయారైంది. ఈరహదారిపై మురికినీరు ప్రవహించడం, పందులు స్వైర విహారం చేయడం, దోమలు వ్యాప్తి చెందడంతో అక్కడ ఉన్న స్థానికులు, అటుగా గుళ్లకు వెళ్లే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో రోజుల నుంచి ఈసమస్య ఉన్నప్పటికీ పంచాయతీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరిచి మురికినీరు రోడ్లపై ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



# మంత్రులు సుభాష్, రవీంద్రలను కలిసిన "పిల్లి" దంపతులు



**కాకినాడ.పెన్ పవర్ జులై 10** :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక,ఫ్యాక్టరీలు, బాయిలర్స్,వైద్య బీమా సర్వీసెస్ శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ,బీసీ వెల్ఫర్, ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ లను విజయవాడలోని వారి కార్యాలయల్లో కాకినాడ రూరల్ కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి మర్యాదపూర్వకంగా కలిసి శాలువా తో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రులు సుభాష్,

-4 లో

# 23 డ్రెయిన్ల ప్రక్షాళన పనులు ప్రారంభం

- తూడు తొలగింపు చర్యలకు మంత్రి రామానాయుడు ఆదేశం
- రూ.10.50 లక్షల నిధులు మంజూరు
- రసాయన పిచికారీ ద్వారా యుద్ధ ప్రాతిపదికన పనులు

**పోడూరు, పెన్ పవర్, జులై 10:**భారీ వర్షాలకు వరి పొలాల్లో ముంపు బారిన పడకుండా డ్రెయిన్ల ప్రక్షాళన పనులు పాలకొల్లు మండలం అగర్తిపాలెం గ్రామంలో బుధవారం ప్రారంభమయ్యాయి.

-4 లో



# కూటమి ప్రభుత్వం లో విద్యా వైద్యానికి అధిక ప్రాధాన్యత

- ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

**కాకినాడ.పెన్ పవర్ జులై 10 :**కూటమి ప్రభుత్వంలో విద్యా వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు.బుధవారం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్.ఎం.సి పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మిస్తున్న మాత శిశు నూతన భవన నిర్మాణంతో పాటు పలు విభాగాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో దాతల సహకారంతో నూతనంగా నిర్మిస్తున్న మాతా శిశు విభాగం త్వరలోనే అందుబాటులో రానున్నదని, రామ్ కానా కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనారాయణ పరిరక్షణలో బిల్డింగ్ పనులు చేయడం జరుగుతుందనని, రంగరాయ మెడికల్ కాలేజ్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ రంగరాయ మెడికల్ కాలేజ్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ నార్త్ అమెరికా సహకారంతో రూ.30 కోట్లుతో బిల్డింగ్ నిర్మాణానికి చేపట్టడం జరుగుతుందని, గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఈ బిల్డింగ్ నిర్మాణాన్ని చేపట్టలేకపోయారన్నారు. 1150 పడగల ఆసుపత్రి అందుబాటులో ఉన్నప్పటికీ రోగులకు పడకలో సరిపోవడం లేదని, నూతన బిల్డింగ్ అందుబాటులోకి వస్తే 500 పడకలు గర్భిణీ చిన్నారులకు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధికి దాతలు సహకరించాలని ఆయన కోరారు.



ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ వెంకటరావు, డాక్టర్ లావణ్య కుమారి, రామ్ కానా రాంకోస సభ్యులు డాక్టర్ చిట్లకిరణ్ కుమార్, డాక్టర్ తేజో కృష్ణ, డా. అరుణ ఆదిత్య, డా ఆనంద్, డాక్టర్ కొండమూరి సత్యనారాయణణ, మల్లిపూడి వీరు, నల్లూరి శ్రీనివాస్, సంగిశెట్టి అశోక్, మల్లాడి గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

## వీర్రాజు చౌదరికి జన్మదిన శుభాకాంక్షలు



**కాజులూరు,పెన్‌పవర్,జూలై10:**నారా లోకేష్ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షులు ,టీడీపీ నేత చుండ్రు వీర్రాజు చౌదరికి పలువురు టీడీపీ నాయకులు, అభిమానులు ,కుటుంబ సభ్యులు పుట్టిన రోజు శు భాకాంక్షలు తెలిపారు.బుధవారం తిమ్మాపురం ప్రజ్ఞ కన్వెన్షన్ హాల్లో ఆయన అభిమానులు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. చౌదరికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన వారిలో చిక్కాల దొరబాబు, రేవు శ్రీను,దేగల సతీష్, మేడిశెట్టి శేషారావు, నులుకుర్తి వెంకటేశ్వరరావు, అంగర కృష్ణ, పోతుల గనిరాజు, దూడల నాగు, సలాది పుష్పావతి, కోట తాతబ్బాయి, పెంకె అప్పారావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, నరాల సుబ్బరాజు, సూరంపూడి భాను, చుండ్రు రుద్ర రావు చౌదరి,టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, జర్నలిస్టు మిత్రులు వాసు, గణేష్, ఏడుకొండలు, బుజ్జి రెడ్డి, ఓంకార్ ,తదితరులు ఉన్నారు.

## రెవెన్యూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

- తాహసిల్దార్ సత్య సులోచన



**గంగవరం, పెన్ పవర్, జూలై 10:**రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని తాహసిల్దార్ సత్య సులోచన అన్నారు.
బుధవారం మండలంలోని రాజుపేట లొద్ది గ్రామంలో రెవెన్యూ గ్రామ సభ నిర్వహించి గ్రామస్తులు నుండి దరఖాస్తుల స్వీకరించారు. ఈ సందర్భంగా తాహసిల్దారు మాట్లాడుతూ కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరమైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎటువంటి అభ్యంతరాలు ఉన్న దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తాహసిల్దారు రాంబాబు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ జిలాని ,సర్వే సిబ్బంది, విఆర్ఓ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎంపీ హరీష్ మాధుర్ ను కలిసిన రమణబాబు.



**అమలాపురం టౌన్, పెన్ పవర్ జూలై 10:**అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాధుర్ ను ఆయన స్వగృహంలో బుధవారం రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు మర్యాదపూర్వకంగా కలిసి ఘన సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి నల్లా స్వామి,టీడీపీ పార్టీ సీనియర్ నాయకులు అల్లాడ శరత్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దున్నాల దుర్గ, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు నల్లా మల్లిబాబు, పట్టణ కార్యదర్శి నల్లా సుబ్బారావు(చిన్నా), యువత ప్రధాన కార్యదర్శి గిడ్ల వెంకటేష్, నియోజకవర్గం టి.యన్.టి.యు.సి. అధ్యక్షులు వలవల శివరావు శిరంగు కృష్ణ కుమార్ మరియు గంథం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# 23 డ్రెయిన్ల ప్రక్షాళన పనులు ప్రారంభం

- 3 పేజి తరువాయి

మొగల్తూరు, భగ్యేశ్వరం మురుగు డ్రైయిన్లలో గుర్రపు డెక్క, తూడు తొలగింపునకు డ్రోన్ ద్వారా రసాయనం చల్లారు. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాలతో మురుగు డ్రైనేజీ శాఖ పర్యవేక్షణలో చేపట్టారు. జున్నూరు గ్రామం నుంచి మొగల్తూరు మండలం పల్లిపాలెం వరకు 25 కిలోమీటర్లు పొడవునా ప్రవహించే మొగల్తూరు మురుగు డ్రైన్ లో దట్టంగా గుర్రపుడెక్క, తూడు పెరిగిపోయాయి. దీంతో మురుగు నీరు పారుదల సక్రమంగా జరగక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో వరి పొలాలు ముంపుకు గురై ఏటా నష్టం వస్తుందన్నారు. మంత్రి రామానాయుడు రైతులకు మేలు జరిగేలా ఉద్దేశంతో పదవి చేపట్టిన వెంటనే చర్యలుకు ఆదేశించారు. పంట కాలువలు, మురుగు డ్రైన్లలో తూడు, గుర్రపుడెక్క, సిల్టు తొలగింపు పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. పనులకు టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టేలా అధికార యంత్రాంగం దృష్టి సారించింది. రూ 10.50 లక్షలు మంజూరు అయ్యాయి. ఈ సందర్భంగా ఏఎంసీ మాజీ చైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు మాట్లాడుతూ రైతులకు మేలు జరిగేలా అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వంలో కాలువల్లో గుర్రపు డెక్క తూడు వంటి తొలగింపు పనులు చేపడుతున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి రామానాయుడు లకు కృతజ్ఞతలు తెలిపారు. రైతు బిడ్డగా మన ఎమ్మెల్యే రామానాయుడుకు జల వనరుల శాఖ కేటాయించడం రాష్ట్రానికి అదృష్టం అన్నారు.
ఈ కార్యక్రమంలో నాయకులు క్లస్టర్ ఇంచార్జ్ కోడి విజయభాస్కర్, అందే కోటి వీరభద్రం, నిమ్మల సారధి, ఉంగరాల నరసింహారావు, నున్న బోయిన సత్యనారాయణ, అంగర వీరభద్ర కుమార్, మేడిది డేవిడ్ జాన్ రాజు, ఇంటి శ్రీరాముడు, కామశెట్టి అయ్యప్ప నాయుడు, నెక్కింటి ఆదినారాయణ,రాయి ప్రసాద్, చెల్లబోయిన సహదేవుడు, రాచమల్ల మీరయ్య, నున్నబోయిన నాగరాజు , నీలం నారాయణమూర్తి, దిడ్ల రామాంజనేయులు. మాదాసు లలిత కుమారి, నూకల శ్రీను , వంట శ్రీను, గిడుగు కిరణ్, మిద్దె కనకరాజు, పంచగళ్ల సైమన్, రాపాక విజయరత్నం, పరువు యేసుదయ తదితరులు పాల్గొన్నారు .

## మంత్రులు సుభాష్, రవీంద్రలను కలిసిన “పిల్లి” దంపతులు

- 3 పేజి తరువాయి

కొల్లు రవీంద్ర,రవి కుమార్ లు..కాకినాడ రూరల్ నియోజకవర్గంలో కూటమి జనసేన పార్టీ అభ్యర్థి అత్యధిక మెజారిటీతో గెలుపొందడం లో “పిల్లి” దంపతులు కృషి అమోఘమైనదని కొనియాడారు.మంత్రులను కలిసిన వారిలో క్లస్టర్ 2 ఇంచార్జి తాతపూడి రామకృష్ణ, టీడీపి పెరిక సాధికార సమితి జిల్లా కన్వీనర్ కొమిరిశెట్టి నరసింగరావు తదితరులు ఉన్నారు.



## కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేసి,కనీస వేతనాలు అమలు చేయాలి- సి.ఐ.టి.యు

**బండి ఆత్మకూరు, పెన్ పవర్, జూలై. 10:** శ్రీశైలం నియోజకవర్గం బండి ఆత్మకూరు మండల సిఐటియు డిమాండ్స్ కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి కనీస వేతనాలు అమలు చేయాలి బండి ఆత్మకూరు మండల కేంద్రంలో సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ సి.ఐ.టి.యు దేశవ్యాప్త డిమాండ్స్ డే సందర్భంగా తాసిల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలియజేసి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సి.ఐ.టి.యు నాయకులు రత్నమయ్య వెంకట రమణమ్మ, వసంత, సుశీలమ్మ , సువర్ణమ్మ , శిరోమణమ్మ, నాగరాజు , మహేష్ , రాజు లు మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నాటి పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను రద్దుచేసి యజమానులకు అనుకూలంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని, వివిధ పథకాలలో పనిచేసే కార్మికులందరికీ ఉద్యోగ భద్రత, కనీస వేతనం పిఎఫ్ , రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యాలు, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం కనీస వేతనం 26,000 లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు వ్యవసాయ కార్మిక




సంఘం సీనియర్ నాయకులు రామచంద్రుడు, మండల కార్యదర్శి డేవిడ్ , స్వచ్ఛభారత్ కార్మిక సంఘం నాయకులు మహేష్ , ఖాదరయ్య మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు నాగలక్ష్మి వివో ఏల సంఘ నాయకులు సుబ్బరాయుడు, రమణమ్మ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ నాయకులు నాగన్న జయన్న తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి మంచిస్థాయికి చేరుకోవాలి

కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు



**కాకినాడ.పెన్ పవర్ జులై 10 :**విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి మంచిస్థాయికి చేరుకోవాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు.బుధవారం కాకినాడ ప్రభుత్వ పి.ఆర్ కళాశాల, పి.ఆర్. ఒకేషనల్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు కొండబాబు చేతుల మీదుగా ఉచిత పాఠ్యపుస్తలను నోటి పుస్తకాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థులకు గతంలో ఉచిత పార్టీ నోటు పుస్తకాలను అందజేయడం జరగలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మొదటిసారిగా ఇంటర్ విద్యార్థులకు ఉచిత పుస్తకాలు అందజేయడం జరుగుతుందని, విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందని, ప్రతి విద్యార్థి పేదరికాన్ని అధిగమించి విద్యలో రాణించినప్పుడే భవిష్యత్ ఉజ్వలమవుతుందన్నారు. సమాజంలో జీవితాలను మార్చేది చదువేనని చదువు చాలా గొప్పదని దానికి కులం, మతం, జాతి అనే తేడాలు ఉండవని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డివిఇఓ జి జి కె నూకరాజు, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ జ్యోతుల రాంబాబు, ఒకేషనల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.తిరుపతిరెడ్డి, శివ ప్రసాద్, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నాయకుడు బాబీని పరామర్శించిన ఎమ్మెల్సీ మాజీ ఎమ్మెల్యే



**గంగవరం, పెన్ పవర్, జూలై 10:**వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అరకు పార్లమెంట్ జిల్లా కార్యదర్శి డి వి మహేష్( బాబి)ని, కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి పరామర్శించారు. ఇటీవల మహేష్ తండ్రి రిటైర్డ్ ఎంఈఓ డివివి సత్యనారాయణ మృతి చెందిన సంఘటన పాఠకులకు విరీతమే. బాబీని పరామర్శించిన వారిలో డిసిసిబి మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ గంగాదేవి, కొత్తడ సర్పంచ్ కామరాజు ,మాజీ సర్పంచ్ సంకురు దొర, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జగదీష్ ,సతీష్, చక్రం తదితరులు ఉన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధనకు కృషి చేయాలి

ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు





**గంగవరం, పెన్ పవర్, జూలై 10 :**రానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధనకు ఉపాధ్యాయులు విద్యార్థులు కృషి చేయాలని ఏజెన్సీ డీఈవో వై మల్లేశ్వరరావు సూచించారు. బుధవారం మండలంలోని టేకుల వీధి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే పాఠ్య ప్రణాళికలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేయాలని విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని ఆయన సూచించారు .ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు బి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# రైతులలకు పచ్చి రొట్టి విత్తనాలు పంపిణీ.

**పెన్ పవర్ - శ్రీ కాళహస్తి రూరల్, జూలై 10.**
శ్రీకాళహస్తి డివిజన్ వ్యవసాయ శాఖ తరపున శ్రీకాళహస్తి నియోజకవర్గం కు సంబంధించిన రైతు సోదరులకు పచ్చిరొట్ట విత్తనములను 50 శాతం రాయితీతో నియోజకవర్గ సంబంధించిన రైతుల సమక్షంలో ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీని ప్రారంభించడం జరిగినది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు పరిపాలనలో రైతులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు ముఖ్యంగా రైతులు కూడా ఒకే రకమైన పంట వేయకుండా పంట మార్పిడి చేస్తే లాభాలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో రైతులకు సబ్సిడీ మీద విత్తనాలు,ఎరువులు,వ్యవసాయ పనిముట్లు రైతన్నలకు అందజేస్తామని అన్నారు త్వరలో అన్ని చెరువులకు కూడికలు తీయించి వ్యవసాయానికి సాగునీటి కొడత లేకుండా చేస్తామని అన్నారు. ఈ సమావేశమునకు శ్రీకాళహస్తి నియోజకవర్గం లోని శ్రీకాళహస్తి తొట్టంబేడు ఏర్పేడు రేణిగుంట మండలాలకు సంబంధించిన రైతులు మరియు నాయకులు పాల్గొనడం జరిగినది, మరియు వ్యవసాయ శాఖ తరపున జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ ప్రసాద్ రావు, ఎ డి. ఎ శ్రీకాళహస్తి రమేష్ రెడ్డి, నియోజకవర్గంలోని నాలుగు మండలాల వ్యవసాయ అధికారులు, రైతు సేవ కేంద్రం యొక్క సిబ్బంది పాల్గొనడం జరిగినది.



## గురుపౌర్ణమి వేడుకలకు అంకురార్పణ...



**అనపర్తి,పెన్ పవర్,జూలై 10.**కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లలమామిడాడ బోడావారి వీధిలో వెలసిన శ్రీ అభయ గణపతి ఆలయంలో వేంచేసియున్న శ్రీ షిరిడి సాయిబాబా వారికి వ్యాస పూర్ణిమ సందర్భముగా గురు పౌర్ణమి వేడుకలు కు అంకురార్పణ గా పుస్తక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇంద్రగంటి మూర్తి ఆధ్వర్యంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త అమ్మి రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధినేత ద్వారంపూడి వెంకటరెడ్డి (చింతపండు)చే ఉదయం ప్రత్యేక పూజల ప్రారంభించారు. ప్రతి సంవత్సరము గురు పౌర్ణమి వేడుకలకు ముందు అంకురార్పణ పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని బాబా ఉత్సవ కమిటీ కన్వీనర్ ద్వారంపూడి యువ రాజారెడ్డి తెలిపారు. గురు పౌర్ణమి రోజున తెల్లవారుజామున సేజ్ హారతి మేలుకొలుపు అనంతరం బాబాకు ప్రత్యేక మహాభిషేకము సహస్రచన పంచ హారతి నిర్వహించడం, గ్రామపరవీధులలో బాబా వారి రథోత్సవము మధ్యాహ్న హారతి, అనంతరము అన్న ప్రసాద వితరణ కార్యక్రమము సాయంత్రం ధూప్ హారతి శ్రీ అభయ గణపతి భజన భక్త బృందం మేడపాటి సాయిబాబా రెడ్డిచే ప్రత్యేక భజన కార్యక్రమాలు రాత్రికి సేజ్ హారతి పవళింపు సేవ నిర్వహించడం జరుగుతుందని యువ రాజారెడ్డి తెలిపారు. ప్రతి ఒక్కరూ గురుపౌర్ణమి రోజున బాబా వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించాలని ఆలయ కమిటీ తరఫున ప్రతి ఒక్కరికి ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కాలినడకన అన్నవరం సత్యనారాయణస్వామి మొక్కు తీర్చుకున్న పార్టీ శ్రేణులు.

- వారితో కలసి స్వామిని దర్శించుకున్న శాసనసభ్యులు బండారు సత్యానందరావు.





**ఆలమూరు, పెన్ పవర్, జూలై 10:**ఇటీవల జరిగిన ఎన్నికలలో కొత్తపేట నియోజకవర్గ శాసనసభ్యునిగా బండారు సత్యానందరావు భారీ విజయం సాధించడంతో ఆలమూరు మండలం చింతలూరు గ్రామానికి చెందిన ఫణి ఆధ్వర్యంలో పలువురు పార్టీ శ్రేణులు కాలినడకన అన్నవరం సత్యనారాయణస్వామి మొక్కు తీర్చుకున్నారు.గత 2 రోజాల క్రితం ఆలమూరు నుండి కాలినడక బయలుదేరి నేడు అన్నవరం చేరుకోవడంతో వారితో కలసి శాసనసభ్యులు బండారు సత్యానందరావు స్వామి వారిని దర్శించుకోవడం జరిగింది. కాలినడకన అన్నవరం బయలుదేరిన వారిలో చింతలూరు ఫణింద్ర కుమార్,నెక్కంటి వీరేంద్ర, బొబ్బా సురేంద్రతో పాటు గ్రామ పార్టీ అధ్యక్షులు వైట్ల గంగరాజు పార్టీ సీనియర్ నాయకులు వైట్ల శేషుబాబు,చనుమోలు గణేశ్వరరావు,వాకా గోవిందరాజు, తదితరులు పాల్గొన్నారు.

## శాకంబరిగా చింతలూరు నూకాంబిక అమ్మవారు.



**ఆలమూరు, పెన్ పవర్, జూలై 10:**గుప్త నవరాత్రుల్లో భాగంగా బుధవారం చింతలూరు శ్రీ నూకాంబిక అమ్మవారు భక్తులకు శాకంబరిగా దర్శనమిచ్చారు. దుర్గమాసురుడు అనే రాక్షసుడు భూమిని ఆక్రమించి ఇక్కడ యజ్ఞ యాగాది క్రతువులు జరగకుండా అడ్డుకోవడంతో కరువు సంభవించింది అప్పుడు మునుల ప్రార్థనతో అమ్మవారు శతాక్షి దేవిగా అవతరించి వానలు కురిపించారు. అలాగే జీవుల ఆకలి బాధలు తీర్చడానికి శాకములు ప్రసాదించారు. దానితో ప్రజల ఆకలి బాధ తీరింది. అప్పటి నుంచి అమ్మవారిని ఆషాడమాసంలో శాకంబరీ దేవి గా అలంకరించి పూజించడం ఆనవాయితీగా వస్తుంది. బుధవారం ఆషాడ శుద్ధ చవితి తో కూడిన పంచమి రోజు చింతలూరు శ్రీ నూకంబిక అమ్మవారిని 108 కిలోల వివిధ రకాల కూరగాయలతో శాకాంబరిగా భక్తులు అలంకరించారు. ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

# సోమవరం లిఫ్ట్ ద్వారా 1200 ఎకరాలకు నీరు....






- ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించి ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ....

**కిర్లంపూడి,పెన్ పవర్ జూలై 10 :** మండలంలోని సోమవరం గ్రామంలో బుధవారం సోమవరం ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా పంప్ హౌస్ కు రిబ్బన్ కట్ చేసి స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ రైతులందరికీ నీరు ఇచ్చే కార్యక్రమం చేస్తున్నామని 1962 నుంచి నిర్విరామంగా పనిచేస్తున్న పంపింగ్ స్కీం ఆంధ్ర రాష్ట్రంలో ఏదైనా ఉందంటే అది సోమవరం పంపింగ్ స్కీం అని ప్రభుత్వంతో పాటు రైతులు ఆర్థిక వనరులు సమకూర్చుకుని నడిపించుకుంటున్నారని అన్నారు. సోమవరం పంపు హౌస్ పునరుద్ధరించి ప్రారంభోత్సవం చేసి రైతులకు నీరందించామని ఏలేరు నీటిని పంపుల ద్వారా లిఫ్ట్ చేసి 1200 ఎకరాలకు సోమవరం లిఫ్ట్ ద్వారా 22 క్యూసెక్కుల నీరు సోమవరం, ఇర్రిపాక, బూరుగుపూడి, కృష్ణవరం గ్రామాల రైతులకు సాగునీరు అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కోర్పు లచ్చయ్య దొర, మండల పార్టీ అధ్యక్షుడు చదరం చంటిబాబు, జంపన సీతారామచంద్ర వర్మ, కొత్త కొండబాబు, నీటి సంఘం అధ్యక్షులు జ్యోతుల పద్మనాభం (బాబు), సూది శ్రీను, మంచి కంటి శ్రీను, జంపన రవి వర్మ, బస్వా చినబాబు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఐటిఐ కాలేజీ, ఎస్సీ, బీసీ హాస్టళ్ల బిల్డింగ్ లు నిర్మించాలి



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 10 :** జగ్గంపేటలో శంకుస్థాపన చేసి వదిలేసిన ప్రభుత్వ ఐటిఐ కాలేజీ నిర్మించాలని, ఎస్సీ, బీసీ హాస్టళ్లకు కొత్త బిల్డింగ్ నిర్మించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పి.డి.ఎస్.యు (వి) జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సతీష్ డిమాండ్ చేశారు. బుధవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను పి.డి.ఎస్.యు బృందం కలిసి డిమాండ్స్ తో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వం శంకుస్థాపన చేసిన ప్రభుత్వ ఐటిఐ కాలేజీని పూర్తి చేయకుండా వైసిపి నిర్వీర్యం చేసిందన్నారు. దీనివలన జగ్గంపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చాలీచాలని తరగతి గదుల్లో ఇబ్బందికరంగా చదువును అభ్యసిస్తున్నారన్నారు. అలాగే గత 35 సంవత్సరాల క్రితం జగ్గంపేటలో నిర్మించిన ఎస్సీ సంక్షేమ బాలుర వసతిగృహం శిథిలావస్థకు చేరిందన్నారు. అక్కడ ఉన్న విద్యార్థులు భయభయంగా చదువులు సాగిస్తున్నారన్నారు. బీసీ బాలుర సంక్షేమ వసతిగృహం గత 12 సంవత్సరాలుగా సొంత బిల్డింగ్ లేక అద్దె బిల్డింగులో ఉంటూ విద్యను సాగిస్తున్నారని ఈ హాస్టల్ కు ప్రభుత్వ బిల్డింగ్ నిర్మించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే నెహ్రూ స్పందించి సీఎం దృష్టికి తీసుకెళ్తానని, నిధులు సమకూర్చి నిర్మాణం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు (వి) జిల్లా కో కన్వీనర్ శ్రీకాంత్, పండు, గంగాధర్, సతీష్, కిరణ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీని ప్రజలు సాగనంపారు

- రామన్నగూడెం ప్రజా దర్బార్లో ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్,జులై 10:**ఐదేళ్లపాటు ప్రజాస్వామ్యాన్ని తన ఇష్టా రాజ్యంగా ఖూనీ చేసి గ్రామపంచాయతీలను నిర్వీర్యం చేసిన జగన్ సర్కార్ ను ప్రజలు చరిత్రలో నిలిచిపోయే విధంగా సాగనంపారని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రామన్నగూడెంలో బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్లో ఆయన మాట్లాడారు. ల్యాండ్, శాండు, మైను, వైను అని తేడా లేకుండా అన్ని రకాలుగా రాష్ట్రాన్ని దోపిడీ చేసిన జగన్ సిగ్గు లేకుండా నెల రోజులకే కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం ఆ విమర్శల్లో జగన్ విశ్వసనీయత తెలుస్తోందన్నారు. కూటమి ప్రభు త్వం రాష్ట్ర అభివృద్ధికి, నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు నచ్చే, మెచ్చే విధంగా పాలన ఉంటుందన్నారు. గత ప్రభుత్వంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని అడ్డదిడ్డంగా దోచుకున్న మాజీ ఎమ్మెల్యే కొట్టును తాడేపల్లిగూడెం నియోజకవర్గం చరిత్రలో ఈ ప్రత్యర్థి చవిచూడని భారీ ఓటమిని రుచి చూపించిన ఘనత నియోజకవర్గ ప్రజలకు దక్కుతుందన్నారు. తనను నమ్మి ఓట్లు వేసిన నియోజకవర్గం అభివృద్ధికి అహర్నిశలు పాటు పడతానన్నారు. గత టిడిపి హయాంలో తాడేపల్లిగూడెం మండలాన్ని అభివృద్ధి చేసిన మాజీ జడ్పీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ వలవల బాబ్జి, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ సహకారంతో ప్రజల అభీష్టం నెరవేరుస్తాన న్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి, బిజెపి, జనసేన నాయకులు హాజరయ్యారు.

## ఐ.ఎఫ్.టి.యు రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 10:** భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐ.ఎఫ్.టి.యు) రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఐ.ఎఫ్.టి.యు నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా కామ్రేడ్ మరుకుర్తి యేసు, ఉపాధ్యక్షుడిగా కామ్రేడ్ కె. అరుణ్ కుమార్, ప్రధానకార్యదర్శిగా కామ్రేడ్ ఆర్.మోహన్, సహాయకార్య దర్శిగా కామ్రేడ్ రాఘవులు, కోశాధికారిగా టి.నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కామ్రేడ్ గుబ్బల ఆదినారాయణ, కామ్రేడ్ కుండ్ల పాపారావురెడ్డి, కామ్రేడ్ శంకర్, కామ్రేడ్ శ్రీను, కామ్రేడ్ గణేశం శ్రీను, కామ్రేడ్ వీరాస్వామి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర కౌన్సిల్ ఆమోదం తెలపగా సభ్యులు అభినందించారు. మూడు క్రిమినల్ చట్టాలు నిలుపుదల, నాలుగు లేబరకోడ్లు రద్దు, కనీస వేతన చట్టం అమలు, హిట్ అండ్ రన్ యాక్టు రద్దు, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణ, ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రయివేటీకరణ ఆపడంపై నూతన కార్యవర్గం పోరాడుతుందని అధ్యక్షుడు మరుకుర్తి యేసు పేర్కొన్నారు.

## పుస్తకాల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ కార్పోరేట్ స్కూల్స్, కాలేజ్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి.

- భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ )డిమాండ్.




**అమలాపురం టౌన్, పెన్ పవర్ జూలై 10:**జిల్లాలో ముఖ్యంగా అమలాపురం పట్టణంలో పాఠ్యపుస్తకాలు పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ స్కూల్స్ కాలేజీలపైన ప్రైవేట్ స్కూల్స్ పైన తక్షణం చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ)డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా స్థానిక గొల్లగూడెం లోని ప్రజాసంఘాల కార్యాలయంలో సమావేశంలో జిల్లా కన్వీనర్ కే శంకర్ కె ప్రణీత్ సాయి మాట్లాడుతూ స్కూల్స్ కాలేజీలు తెరిచి ఒక నెల రోజులు అవుతుండగానే పుస్తకాలకు ఫీజులు చెల్లించాలని విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్నారని వారు అన్నారు.

అధిక ఫీజులు భారం భరించలేక కొందరు విద్యార్థులు మానసిక వత్తిడికి గురై చదువులలో వెనుకబడుతున్నారని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు,కాలేజీలు ఫీజులు కట్టలేదనే పేరుతో గంటలు తరబడి క్లాస్ రూమ్ కి బయట నిలబెట్టి మానసికంగా వేదించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని దీంతో విద్యార్థులు మానసికంగా వేదనకు గురవుతున్నారని ఆరోపించారు. అదేవిధంగా గత ప్రభుత్వం విద్యార్థులకు పథకాల పేర్లతో చెల్లించవలసిన నిధులు చెల్లించలేదని ఆ బకాయిలు కూడా చెల్లించాలని కొన్ని కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తీసుకురావడం జరుగుతుందని ఇది అన్యాయమని తక్షణం ఇటువంటి అధిక ఫీజులు వసూలు చేస్తున్న కాలేజీ స్కూల్స్ కార్పొరేట్ కాలేజీల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా తక్షణమే ప్రభుత్వ ఉన్నతాధికారులు వీటిపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళన దిగుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కే ప్రణీత్ సాయి నాయకులు పొలమూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## నవోదయలో ప్రతిభ చాటిన డా.ఉమర్ ఆలీషా విద్యార్థి...

- పెద్దాపురంలో నవోదయ సీటు సాధించడం పై పలువురి అభినందన




**కిర్లంపూడి, పెన్ పవర్ జూలై 10 :** మండలంలోని గెద్దనాపల్లి గ్రామంలో ఉన్న డా.ఉమర్ ఆలీషా ఇంగ్లీష్ మీడియం స్కూల్లో చదువుతున్న అదే మండలం ఎస్.తిమ్మాపురం గ్రామానికి చెందిన సింగం వెంకట్ అశ్వంత్ పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయలో సెకండ్ మెరిట్ లిస్టులో సీటు సాధించాడని పాఠశాల కరస్పాండెంట్ ఇనకోటి శ్రీ గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్ అశ్వంత్ ని కరస్పాండెంట్ ఇనకోటి శ్రీ గంగాధర్ తో పాటు ఉపాధ్యాయులు, పలువురు గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు. అలాగే ఎటువంటి కోచింగ్ లేకుండా తమ స్కూల్లో చదువుతూ వెంకట్ అశ్వంత్ ప్రతిభతో నవోదయ పరీక్షను రాసి సీటు సాధించాడని పాఠశాల కరస్పాండెంట్ ఇనకోటి శ్రీ గంగాధర్ తెలిపారు.

## గ్రామాలలో శానిటేషన్ తప్పనిసరి-ఎంపీడీవో




**వై రామవరం, పెన్ పవర్,జూలై 11 :**జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ప్రతి గ్రామంలో శానిటేషన్ తప్పనిసరిగా అమలు చేయాలని పంచాయతీ సెక్రెటరీలను ఎంపీడీవో ఆదేశించారు.

పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో ఈ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు ఆధార్ కార్డు లేని వారి డేటా, ఆధార్ కార్డ్ అప్డేషన్ సేకరించడానికి సచివాలయ సిబ్బంది అందరూ ఇంటింటి సర్వే చేయాలన్నారు. ఈ సర్వే కార్యక్రమంలో ఏఎన్ఎం లను మినహా హించడం జరిగిందని తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

# ఇబ్బందుల్లో రైస్ మిల్ రంగం.. సంక్షోభంలో రైతాంగం...






- రైస్ మిల్లర్ల సత్కార సభలో ఎమ్మెల్యే నల్లమిల్లి...

**అనపర్తి,పెన్ పవర్,జూలై 10.**గడచిన ఐదేళ్ల జగన్మోహన్ రెడ్డి పాలనలో రైస్ మిల్లు రంగం ఇబ్బందుల్లో కూరుకపోతే రైతాంగం సంక్షోభంలో ఇరుక్కుపోయారని ఈ రెండు రంగాలను ఆయా సమస్యల నుంచి బయటకు తీసుకురావాల్సిన అవసరం రాజకీయ ప్రజాప్రతినిధులుగా తమపై బాధ్యత ఉందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

నియోజకవర్గ కేంద్రమైన అనపర్తిలో ఎస్ ఎన్ ఆర్ ఫంక్షన్ హాల్లో ఇటీవల తూర్పుగోదావరి జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ కర్రి వెంకట రెడ్డి అధ్యక్షుడిగా ఏర్పడిన నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవం అనంతరం ఆయనకు జరిగిన అభినందన కార్యక్రమంలో రైస్ మిల్లర్లను ఉద్దేశించి సుదీర్ఘ ఉపన్యాసం చేశారు. పూర్వపు అధ్యక్షులు నల్లమిల్లి బుల్లి మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత 40 సంవత్సరాల నుంచి పరిశీలిస్తే రైస్ మిల్ రంగం సంక్షోభంలో ఉంటే రైతాంగం సంక్షేమం గా ఉండేదని అప్పుడప్పుడు పరిస్థితులు తారుమారైన గత ప్రభుత్వంలో మాత్రం రెండు వ్యవస్థలు సంక్షోభంలో కూరుకు పోయాయి అన్నారు.

ఇటు రైస్ మిల్లు రంగానికి అవసరమైన విద్యుత్ తయారీ రంగాన్ని కుప్పకూల్చారని 1.73 లక్షల కోట్ల రూపాయలు విద్యుత్ రంగం బకాయి పడింది అన్నారు. ఈ పరిస్థితులలో కూటమి ప్రభుత్వం చాలా ఇబ్బందులను ఎదుర్కొంటూ ప్రజలకు అవసరమైన వ్యవస్థలను గాడిన పెట్టేందుకు సర్వశక్తులు ఒడ్డుతుందన్నారు. క్లస్టర్ బిల్డింగులు ప్రభుత్వం నుంచి మీకు రావాల్సిన బకాయిలను చెల్లించేందుకు తాను కృషి చేస్తానన్నారు. అయితే రైస్ మిల్లర్లు కూడా బేషజాలకు పోకుండా సంఘటితంగా ఉంటే సమస్యల పరిష్కారానికి మార్గాలు సుగమమవుతాయి అన్నారు. గత ప్రభుత్వం అసమర్థ, దుర్మార్గపు పాలన వలన వ్యవస్థలన్నీ నాశనమైపోయాయని వాటిని సరిదిద్దుకు రావడానికి సంవత్సరాలు పట్టే అవకాశం ఉందన్నారు మన నియోజకవర్గంలో కెనాల్ రోడ్డుతో పాటు చాలా రోడ్లు చిద్రమైపోయాయని వాహన చోదకులకు నరకప్రాయంగా మారిందన్నారు. వాటిని అభివృద్ధి కోసం ఒక ప్రణాళికను సిద్ధం చేసుకున్నానని దానిని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించే క్రమంలో తాను ఉన్నానన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొన్ని రోడ్లను గుర్తించాలని వాటిని నిర్మించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేసేందుకు నిధులు కూడా మంజూరు చేయించాను అన్నారు ఈ వర్షాకాలం అనంతరం వాటి నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తూర్పుగోదావరి జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు కర్రి వెంకటరెడ్డి తో కూడిన పాలకవర్గాన్ని ఆయన అభినందించారు. అధ్యక్షుడిగా వెంకటరెడ్డి ఉపాధ్యక్షుడిగా రామ్మూర్తి రెడ్డి సంయుక్త కార్యదర్శిగా రాజేష్ ట్రెజరర్ గా బలుసు శ్రీనివాసరావు లను ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పూలమాలలు శాలువా మెమెంటోలతో ఘనంగా సత్కరిస్తూ మీ బాధ్యతలను సక్రమంగా నిర్వహించి మీ సంక్షేమంతో పాటు రైతు సంక్షేమాన్ని కూడా దృష్టిలో పెట్టుకుని మీ రంగాలను నిర్వహించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని నూతన పాలకవర్గంతో పాటు వేదిక అలంకరించిన పారిశ్రామికవేత్తలు మేడపాటి రామలింగారెడ్డి, కొవ్వూరి పాపారెడ్డి, జొన్నాడ శ్రీధర్, చింత వీర రాఘవరెడ్డి నల్లమిల్లి బుల్లి మోహన్ రెడ్డి కార్యక్రమానికి సుమారు 100 మంది రైస్ మిల్లర్లు పూల మాలలు శాలువాలు జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. రామకృష్ణారెడ్డి సన్మానం సుమారు గంట సేపు కొనసాగింది. సభకు సంధానకర్తలుగా వ్యవహరించిన దుర్భ శ్రీరామ్ మూర్తి కర్రి నారాయణరెడ్డి లను ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సత్కరించారు. అనంతరం అధ్యక్షుడుగా ఎన్నికైన వెంకటరెడ్డి మాట్లాడుతూ జిల్లా రైస్ మిల్లర్లు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైస్ మిల్లు రంగం అభివృద్ధి చెందడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సన్మాన సత్కార కార్యక్రమంలో రైస్ మిల్లర్లు, రామకృష్ణారెడ్డి, వెంకట రెడ్డి, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## కాట్రేనికోనలో డిమాండ్ డే




**కాట్రేనికోన /అమలాపురం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, జూలై 10:** సార్వత్రిక ఎన్నికల్లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు ఇచ్చిన హామీలు అమలుకు వెంటనే కృషిచేయాలని ప్రజాసంఘాలు అద్వర్యంలో కాట్రేనికోన తహశీల్దార్ కార్యాలయంం ఎదుట బుధవారం డిమాండ్ డే లో భాగంగా నిరసన తెలిపారు. తహశీల్దార్ డి ప్రశాంతికి వినతిపత్రం సమర్పించారు . ఉద్యోగ, కార్మికుల సమస్యల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వెంటనే పరిష్కరించాలని కోరుతూ దేశ వ్యాప్తంగా "డిమాండ్స్ ,డే, నిర్వహించడం జరిగిందని ఆందోళనకారులు అన్నారు. కార్మికులు, ఉద్యోగుల సమస్యలు దీర్ఘకాలంగా పరిష్కారం కాకుండా ఉన్నాయని. పెరుగుతున్న ధరలతో అరకొర జీతాలతో కుటుంబాల పోషణ కష్టంగా మారిందని నిత్యవసర ధరలు అదుపు చేయాలని కోరారు. ప్రభుత్వ విధానాల వల్ల ఉద్యోగ భద్రత లేకుండా పోతుందని. తెలిపారు,బడ్జెట్ నిధుల కోతతో అన్ని రంగాల కార్మికులకు, సామాన్య ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని బడ్జెట్లో నిదులు పెంచాలని డిమాండ్ చేసారు. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నిల ముందు కార్మిక సంఘాలు అంగన్వాడీ అశ మద్యాహ్నం బోజన కార్మికులు ఐకెపి వి ఆర్ ఎ లు అనేక రంగాల్లో పనిచేస్తున్న వారికి నేటి పాలకులు ఎన్నికల హమిలు ఇవ్వడం జరిందన్నారు వీటి అమలకు కృషిచేయాలని డిమాండ్ చేసారు, 1) కార్మికులు, ఉద్యోగులకు హాని చేసే లేబర్ కోడ్స్ను వెంటనే రద్దుచేయాలని 2) అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, వెలుగు వి.ఒ.ఏ.లు విఆర్ ఎ, మధ్యాహ్నభోజన పథకం, మెప్మా, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్రశిక్ష, ఉపాధిహామి, ఆయుష్, సేంద్రియ వ్యవసాయం, 108, 104 తదితర అన్ని పథకాల కార్మికులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలి. వారికి కనీస వేతనాలు చెల్లించాలి. వారికి కనీస వేతనం,పెన్షన్ లాంటి సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలి. 3) అసంఘటిత రంగ కార్మికులైన ముఠా, ఆటో బిల్డింగ్, తోపుడు బళ్లు, మోటారు తదితర కార్మికులకు పని భద్రత, ప్రభుత్వ ద్వారా సమగ్ర చట్టం చేయాలని. 4) పంచాయితీ కార్మికుల బకాయి జీతాలు చెల్లించాలి. విఆర్ఎ లకు వేతనాలు పెంపును అమలు చేయాలని. 5) కనీస వేతనాలు నెలకు రూ.26 వేలు చొప్పున నిర్ణయించి అమలు చేయాలి.

6) కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, కంటింజెంట్, పార్టం, గెస్ట్ తదితర కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని. కాంట్రాక్టరు తొలగించినా కార్మికులను వెంటనే విదుల్లోకి తీసుకోవాలని. అందరికీ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని. రెగ్యులర్ చెయ్యాలి. 7) ఓల్డ్ పెన్షన్ స్కీమ్ను అమలు చేయాలని. నూతన పెన్షన్ స్కీమ్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు

## కరపలో అంగన్వాడీలు, ఆశావర్కర్లు ధర్నా



**కరప, పెన్ పవర్, జూలై 10:** సమస్యలు పరిష్కారం కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు. ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజనపథకం కార్మికులు, స్కూలు స్లీపర్స్ ధర్నా నిర్వహించారు. సీఐటీయు కాకినాడజిల్లా కమిటీ పిలుపుమేరకు మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, మధ్యాహ్నభోజనపథకం కార్మికులు బుధవారం కరప తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని కొద్దిసేపు ధర్నా చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, ప్రతినెల 5వ తేదీలోగా వేతానాలు చెల్లించాలని, పని ఒత్తిడి తగ్గించాలని, నాలుగునెలల బకాయి వేతనాలు చెల్లించాలని, శానిటేషన్ వర్కర్స్ కార్మికులుగా గుర్తించాలని నినాదాలు చేశారు. అనంతరం తమడిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ కె. అనిల్ కుమార్ కు అందజేశారు. అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు పి. వీరవేణి, సెక్టార్ లీడర్స్ ఎస్.వరలక్ష్మి, ఎం. భవానీ, ఎం.దేవి. కేవీ వెంకటలక్ష్మి, డి. దేవి. బి. అంజమ్మ, వి.లోవలక్ష్మి. కె.శాంతకుమారి, కె.దేవి, ఎస్.సూర్యకుమారి, అచ్చారత్నం, జ్యోటి, కె. కల్పలత, కె.లక్ష్మి, ఎం.దేవి తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక,ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి.






**ఆలమూరు, పెన్ పవర్, జూలై 10:**సార్వత్రిక ఎన్నికల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు ఇచ్చిన హామీలు అమలుకు వెంటనే కృషిచేయాలని బుధవారం దేశవ్యాప్తంగా జరుగుతున్న డిమాండ్స్ డే సందర్భంగా మండల కేంద్రమైన ఆలమూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిఐటియు అధ్వర్యంలో అంగన్వాడి, ఆశ,మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు నిరసన తెలిపి తహశీల్దార్ డివిఎన్ అనిల్ కుమార్ కు వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగ, కార్మికుల స్కీమ్ వర్కర్ల సమస్యల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వెంటనే పరిష్కరించాలని, పెరుగుతున్న ధరలతో అరకొర జీతాలతో కుటుంబాల పోషణ కష్టంగా మారిందని నిత్యవసర ధరలు అదుపు చేయాలని కోరారు. ప్రభుత్వ విధానాల వల్ల ఉద్యోగ భద్రత లేకుండా పోతుందని తెలిపారు. బడ్జెట్ నిధుల కోతతో అన్ని రంగాల కార్మికులకు, సామాన్య ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని బడ్జెట్లో నిదులు పెంచాలని డిమాండ్ చేసారు. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నిల ముందు కార్మిక సంఘాలు స్కీమ్ వర్కర్లు అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజన కార్మికులు అనేక రంగాల్లో పనిచేస్తున్న వారికి నేటి పాలకులు ఎన్నికల హమిలు ఇవ్వడం జరిందన్నారు. వాటిని అమలకు కృషి చేయాలని డిమాండ్ చేసారు. 1) కార్మికులు, ఉద్యోగులకు హాని చేసే లేబర్ కోడ్స్ను వెంటనే రద్దుచేయాలి. 2) అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, వెలుగు వి.ఒ.ఏ.లు విఆర్ఎ, మధ్యాహ్నభోజన పథకం, మెప్మా, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్రశిక్ష, ఉపాధిహామి, ఆయుష్, సేంద్రియ వ్యవసాయం, 108, 104 తదితర అన్ని పథకాల కార్మికులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలి. 3)వారికి కనీస వేతనాలు చెల్లించి,పెన్షన్ లాంటి సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలి. 4) కనీస వేతనాలు నెలకు రూ.26 వేలు చొప్పున నిర్ణయించి అమలు చేయాలి. 5)అందరికీ సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తూ రెగ్యులర్ చెయ్యాలి. 6) ఓల్డ్ పెన్షన్ స్కీమ్ను అమలు చేయాలని, నూతన పెన్షన్ స్కీమ్ ను రద్దు చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్లు,ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పాల్గొన్నారు.

## మురుగు ముంపు నుంచి తప్పించండి మహాప్రభో

- తూర్పుపాలెం-ఆచంట గ్రామాల సరిహద్దు ఎన్టీఆర్ కాలనీవాసుల ఆర్తనాదాలు
- డ్రైయినేజీ నిర్మాణం అసంపూర్తి పనులతో అగచాట్లు





**పోడూరు, పెన్ పవర్, జులై-08:** ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం ప్రజల మౌలిక సదుపాయాలకు విఘాతం ఏర్పడుతుంది. అధికారులు చెప్పే పరిసరాలను పరిశుభ్రత కానరావడం లేదు. పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సిన సిబ్బంది ఉండరు. పర్యవేక్షించాల్సిన స్థానిక అధికారులు జాడ లేదు. ప్రభుత్వం డ్రైయినేజీ, సీసీ రహదారులు నిర్మించాలని నిధులు కేటాయిస్తే గుత్తేదారులు తమ ఇష్టానుసారంగా అసంపూర్తిగా పనులు చేపట్టినా స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంతో నిధులు దుర్వినియోగంకాక తప్పడం లేదు. వర్షం వస్తే రోజుల తరబడి మురుగునీటి మధ్య జీవించాల్సిన దుస్థితి తూర్పుపాలెం- ఆచంట గ్రామాల సరిహద్దు ప్రాంతమైన ఎన్టీఆర్ కాలనీలో నెలకొంది. అసలు విషయానికి వస్తే కొన్నేళ్లక్రితం నిర్మించిన సీసీ రహదారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకోకుండా పల్లపు ప్రాంతంలోనే ఏర్పాటు చేయడం ఆ కాలనీవాసుల దురదృష్టంగా భావిస్తున్నామని వాపోతున్నారు. ఎట్టకేలకు ఏడాది క్రితం రూ.8 లక్షలు నిధులు ఖర్చు చేసి నిర్మించిన సీసీ డ్రైయినేజీ అదే పల్లపు ప్రాంతంలో అసంపూర్తిగా నిర్మించడంతో ఆ సమస్య మరింత జఠిలంగా మారింది. ఇటీవల తరచూ ఎడతెరిపిలేని వానకు డ్రైయినేజీలోని మురుగు పొంగి రహదారిపైకి రావడంతో రోజుల తరబడి నీరు నిలిచిపోవడంతో దోమలు, దుర్గంధంతో విషజ్వరాలకు గురవుతున్నా పట్టించుకున్నవారే కరవయ్యారని గగ్గోలు పెడుతున్నారు. సమస్యను ఎన్నిసార్లు కాలనీవాసులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తూతూమంత్రంగా పనులు చేపడుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం లేదు. ఈ కాలనీ నియోజకవర్గ కేంద్రమైన ఆచంట గ్రామానికి చెందినదైనా శివారుప్రాంతం కావడంతో పట్టించుకోనేవారు లేరని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 30 కుటుంబాలు నివాసం ఉండే ఈ కాలనీ జఠిల సమస్యను ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవు



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై10:** మండలంలోని కాట్రావులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం మిషన్ శక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జగ్గంపేట ఐసీడీఎస్ సీడీపీవో ఎం.పూర్ణిమ మాట్లాడుతూ మిషన్ శక్తి లో భాగంగా మహిళలు, బాలల చట్టాలపై జూన్ 21 నుంచి అక్టోబర్ 4వతేదీ వరకు వంద రోజుల పాటు గ్రామ, మండల స్థాయిలో ఐసీడీఎస్, మెడికల్, పోలీసు శాఖ సమన్వయంతో అవగాహన కల్పిస్తున్నారు. దీనిలో భాగంగా జూలై 8 నుంచి 12 వరకు మెటర్నరీ బెనిఫిట్ వారం జరుపుతున్నారు. ప్రధానమంత్రి మాతృత్వ యోజన దేశ వ్యాప్తంగా మహిళలకు సాధికారిత కల్పించడమే దీని ఉద్దేశ్యంగా కేంద్ర ప్రభుత్వం 2017లో ప్రారంభించింది. ఈ పథకం క్రింద గర్భిణీలకు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. గర్భస్థశిశువును కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని వైద్య, పోలీసు శాఖ సమన్వయంతో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం పటిష్టం చేయవచ్చున్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## మొక్కు తీర్చుకోవడానికి వెళుతున్న టిడిపి కార్యకర్తలు.

- జొన్నాడ నుంచి గౌరీపట్నం కు బైక్ ర్యాలీ.
- బైక్ ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు.



**ఆలమూరు, పెన్ పవర్ జూలై 10:**సార్వత్రిక ఎన్నికలలో కూటమి భారీ విజయం సాధించాలని మొక్కుకున్న టిడిపి జనసేన కార్యకర్తలు జొన్నాడ నుంచి గౌరీపట్నం కు బైక్ ర్యాలీగా బుధవారం బయలుదేరారు. బైక్ ర్యాలీని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. రాష్ట్రంలో తెలుగుదేశం జనసేన బిజెపి పార్టీలో కూటమి కి దేవుడు ఆశీస్సులు మెండుగా ఉన్నాయని దీంతో రాష్ట్రంలో కూటమి భారీవిజయం సాధించిందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. విజయంలో ఎంతకనో శ్రమించిన యువకులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు కొత్తపేట ఎమ్మెల్యేగా బండారు సత్యానందరావు గెలుపు పొందాలని గెలుపు అనంతరం గౌరీపట్నం కు బైక్ ర్యాలీగా వస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి టిడిపి నాయకుడు కొమ్ము నారాయుడు మొక్కుకున్నారు దీనిలో భాగంగా ఆయన ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జొన్నాడ నుంచి గౌరీపట్నం కు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆలమూరు మండలానికి చెందిన తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం

**కాజులూరు,పెన్‌పవర్,జూలై10:** మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేదయడం జరుగుతందని ఎలక్ట్రికల్ ఏఈ సూర్యనారాయణ మీడియాకు తెలిపారు. ఇంజరం సబ్ స్టేషన్ పరిధిలోని 33/11 కేవి సప్లై ఉదయం 9 గంటలనుంచి 2 గంటలవరకు పూర్తిగా నిలిపివేదయం జరుగుతుందన్నారు. కోలంక 11 కేవీ ఫీడర్‌కు సంబంధించి కోలంక, చలివేంద్రపాడు,నామవానిపాలెం ,పొలమురిపాడు,అలాగే 11కేవీ కోలంక ఇండస్ట్రీయల్ ఫీడర్ పరిధి లో గల 1.కోలంక 2. నామావాని పాలెం 3.ఉప్పుమిల్లి ప్రాంతం, ఆక్వా ఇండస్ట్రీయల్ ఏరియా లకు సప్లై ఉండదన్నారు. ఆయా గ్రామాల్లోని లైన్లు,ట్రీ ట్రిమ్మింగ్ మరమ్మతులలో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. కావున విద్యుత్ వినియోగ దారులు వర్కు జరిగేందుకు సహకరించాల్సిందిగా ఏపీఈపీ డీసీఎల్ కాకినాడ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.ప్రసాద్ కోరారు.

## చెరువుల వేలం పాట

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జులై 10:**మండలంలోని చిన తాడేపల్లి గ్రామపంచాయ తీ పరిధిలోని మూడు చెరువుల సంబంధించి వేలంపాటలు గ్రామ సర్పంచ్ పిచ్చుకుల రాజారావు, గ్రామ పంచాయతీల విస్తరణాధికారి వెంకటేష్ సమక్షంలో మూడు సంవత్సరాల కాల వ్యవధికి బహిరంగ వేలం నిర్వహించారు. ఈ చెరువులకు సంబంధించి డివిజనల్ పంచాయతీ అధికారి కనీస ధరలు కొత్తచెరువుకు సంబంధిం చి రూ.14 లక్షలు, వడపు చెరువుకు సంబంధించి రూ.16 లక్షలు, అంకుడు చెరువుకు రూ. 20 లక్షలకు ఉత్తర్వులు ఇచ్చారు. కొత్తచెరువు రూ.25 లక్షలు, వడపుచెరువు రూ.29 లక్షలు, అంకుడు చెరువు 29 లక్షల 25 వేల రూపాయలకు బహిరంగ వేలం ద్వారా హెచ్చు పాటకు పాడారు.

## ప్రధాన రంగాలకు ప్రాధాన్యత..ఎమ్మెల్యే నల్లమిల్లి



**అనపర్తి,పెన్ పవర్,జూలై 10.** విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి రంగాలకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి రామారెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు విద్య కిట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 4 మండలాల్లో చదువుతున్న విద్యార్థులకు సుమారు రూ.3.82కోట్ల విలువైన 15249 కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

విద్యార్థులు ఉపాధ్యాయుల పట్ల గౌరవప్రదంగా ఉండాలని, ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రేమపూర్వకంగా వ్యవహరించాలన్నారు. విద్యా రంగంలో రాజకీయాలకు చోటు ఉండకూడదనే ఉద్దేశంతో కిట్లను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. విద్యా వైద్యం, ఉపాధి వ్యవసాయ రంగాలను ప్రాధాన్యతిస్తూ అనపర్తి నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు.

ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు కొవ్వూరి శ్రీనివాస్ రెడ్డి, తమలపూడి సుధాకర్ రెడ్డి, కర్రి వెంకట రామారెడ్డి, సిరసపల్లి నాగేశ్వరరావు సత్తి దేవదాన్ రెడ్డి, నాలుగు మండలాల ఎంఈవోలు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి చేద్దాం.

- ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.



**ఆలమూరు, పెన్ పవర్, జూలై 10:** ఆలమూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు హామీ ఇచ్చారు. బుధవారం ఆలమూరు చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వి నరసింహస్వామి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది వాడపాలెంలో బండారు సత్యానందరావును కలిసి కళాశాల స్థితిగతులను వివరించారు. ప్రస్తుతం డిగ్రీ అడ్మిషన్లలో మొదటి విడతలో బీకాం 10 మంది విద్యార్థులు బీఏ 10 మంది విద్యార్థులు బీఎస్సీలో నలుగురు విద్యార్థులు చేరడం జరిగిందని వారందరికీ మొదటి సంవత్సరం ఫీజు చారిటబుల్ ట్రస్ట్ భరిస్తుందని ఇంకా రెండు మూడు విడతల అడ్మిషన్లు ఉన్నాయని కళాశాల అధ్యాపక బృందం ఎమ్మెల్యేకు వివరించారు. జూనియర్ కళాశాల డిగ్రీ కళాశాల పక్కా భవనాలు నిర్మించడంతో పాటు కళాశాల అభివృద్ధికి తన సహకారం ఎల్లవేళలా అందిస్తానని, ఆలమూరు పరిసర ప్రాంత విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని,అందరూ కలిసి కళాశాల అభివృద్ధికి కృషి చేయాలని బండారు సత్యానందరావు ఆకాంక్ష వ్యక్తం చేశారు.

## నాటు సారాతో వ్యక్తి అరెస్ట్

- 1000 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



**రంగంపేట,పెన్ పవర్, జులై 10:** స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్స్ బ్యూరో సీఐ ఎస్ రాంబాబు అనపర్తి నియోజకవర్గం లో విస్తృత దాడులు నిర్వహించారు. బుధవారం ఈ దాడుల్లో రాజానగరం మండలం రఘునాథపురం గ్రామానికి చెందిన బల్లి సత్తిబాబు అనే వ్యక్తి బిక్కవోలు మండలం కానేడు గ్రామ పరిధిలో నాటు సారా తయారు చేస్తుండగా ఎన్ఫోర్స్మెంట్ అధికారులు పట్టుకున్నట్లు సీఐ తెలిపారు.35 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని,నాటు సారాకి ఉపయోగించే 1000 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి బల్లి సత్తిబాబుని అరెస్ట్ చేసినట్లు సీఐ ఎస్.రాంబాబు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై జి. అనిల్ బాబు,సిబ్బంది పాల్గొన్నారు.

## పురపాలక అవినీతిని బయటపెడతా

- ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జులై 10:** పురపాలక సంఘంలో జరిగిన అవినీతిని బయట పెడతామని తాడేపల్లిగూ డెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వెళ్లే సమయానికి కొంతమంది అధికారులు, సిబ్బంది విధులకు హాజరు కాకపోవడం పై సీరియస్ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగా సిబ్బంది అలసత్వం వహించి ప్రజల సమస్యలు పెడ చెవిని పెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణతో ఇప్పటికే తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై ఎంక్వయిరీకి కోరామని, తిన్న ప్రతి పైసా కట్టించేంతవరకు వదిలిపెట్టబోమని ఎం ఎల్ఏ హెచ్చరించారు.

# మత్తు కు బానిసలు కావద్దు.

- ఈవ్ టీజింగ్ కు పాల్పడితే చర్యలే.

**మండపేట.పెన్ పవర్.జూలై 10 :** యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని మండపేట టౌన్ ఎస్ ఐ హరి కోటి శాస్త్రి హెచ్చరించారు. మండపేట విజ్ఞాన్ విద్య సంస్థ లో బుదవారం డ్రగ్స్ వ్యతిరేక, ఈవ్ టీజింగ్ లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు కు యువత ఆకర్షితులై తమ జీవితాలని నాశనం చేసుకోవడం మంచిది కాదని పేర్కొన్నారు. యువకులు సంపూర్ణ ఆరోగ్యం గా ఉండటానికి ప్రయత్నం చేయాలనీ కోరారు. మంచి అలవాట్లు అలవర్చుకోవాలని కోరారు.శారీరక వ్యాయామం, యోగా ఆసనాలు, నడక, క్రీడలు వంటి వాటిపై దృష్టి పెట్టాలని కోరారు. డ్రగ్స్ వల్ల కేసుల్లో ఇరుక్కొని ఇబ్బందులు పాలవ్వలని హెచ్చరించారు. వేగంగా ద్విచక్ర వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్ధాలు వివరించారు.యువతులు,బాలికలను ఎవరైనా వేధిస్తే సహించేది లేదన్నారు. ముఖ్యంగా విద్యార్థినులు ఎవరివల్ల అయిన ఇబ్బందులు ఎదురైతే నేరుగా పోలీసులకు ఫోన్ చేయాలని వారి వివరాలు గోప్యంగా వుంచి అల్లరి మూకల తాట తీస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ఎస్ ఐ నాంచరయ్య పాల్గొన్నారు.





## డ్రైనేజీలలో పూడికతీతలు





**తాళ్ళపూడి, పెన్ పవర్, జులై 10:** పెద్దేవం గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ ఆధ్వర్యంలో డ్రైనేజీల పూడికతీతలు జరుగుతున్నాయి. జేసిబితో, పారిశుధ్య కార్మికులచే డ్రైనేజీలలో పూడుకుపోయిన చెత్తను తొలగించడం జరుగుతుంది. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి అలేఖ్య మాట్లాడుతూ వర్షాకాలం కాబట్టి పంచాయతీ పరిధిలోని ప్రజల ఆరోగ్యం దృష్ట్యా వీధులలో నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీలలో పూడుకుపోయిన చెత్తను తొలగించే కార్యక్రమం చేపట్టడం జరిగిందని అన్నారు. అదేవిధంగా దోమలు దరిచేరకుండా వీధులను శుభ్రం చేయించి శానిటేషన్ చేయిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణ పై న్యాయ అవగాహన సదస్సు.





**ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 10:** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బుధవారం మండల లీగల్ సర్వీస్ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణ పై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. మండల పరిధి యర్రవరం గ్రామంలో విజ్ఞాన జ్యోతి జూనియర్ కాలేజీలో "రోడ్డు ప్రమాదాల నివారణ "పై నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సు లో మండల లీగల్ సర్వీస్ కమిటీ ప్రత్తిపాడు కోర్ట్ ప్యానల్ న్యాయవాదులు బుగత శివ, అవసరాల దేవి, ఏలేశ్వరం ఎస్సై జి సతీష్ లు మాట్లాడుతూ మోటారు వాహన చట్టం అమలు, ద్విచక్ర వాహనదారుల హెల్మెట్ ఉపయోగం, లైసెన్స్ లేకుండా జరిగే ప్రయాణాలు, సీట్ బెల్ట్ ఉపయోగం తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. న్యాయ చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, ప్రత్యేకించి విద్యార్థులు మోటార్ సైకిల్ లు లైసెన్సు లేకుండా, హెల్మెట్లు లేకుండా నడుపుతున్నారని, వీటివల్ల ప్రమాదాల బారిన పడుతున్నారని,పోలీసులు కేసులు నమోదు చేస్తే విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా శిక్షార్హులవుతారని "పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు తమ వంతు ప్రయత్నం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సదస్సుల కాలేజీ విద్యార్థినీ విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ఉత్తమ విజేతగా డా. బాలచందర్ సాదే



**పెనుమంట్ర,పెన్ పవర్, జులై 10:** తెలుగు భాషాభ్యున్నతికి అవిరళ కృషి చేయుచున్న సాహిత్య సంస్థ సంస్థ అక్షర శిల్పం ఆద్వర్యంలో అంతర్జాల కవితా పోటీల్లో పుట్టినిల్లు మెట్టినిల్లు అంశం పై కవితను రాసి తాను ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రముఖ కవి రచయిత తెలుగు శాఖాధిపతి డా. బాలచందర్ సాదే విలేఖరులకు తెలిపారు. సంస్థ అధ్యక్షులు నిర్వాహకులు లక్ష్మీ నరసింహ గౌడ్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీ సామవేదం బాలచందర్ కవితను ఉత్తమ కవితగా ప్రకటిస్తూ విజేత ధృవపత్రాన్ని అందించారు ఈ సందర్భంగా యస్ వి కె పి కళాశాలల పాలకవర్గ అధ్యక్షులు పితాని సూర్యనారాయణ సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ కె రామచంద్రరాజు కోశాధికారి ఉద్దగిరి లవకుమార్, ప్రిన్సిపాల్ కెవిఆర్ సూర్య నారాయణ, విశ్రాంత ఆచార్యులు మేడిపల్లి రవికుమార్, రంకిరెడ్డి రామ్మోహనరావు, అసోసియేట్ ప్రొ. డా. మత్తే జయజీవిత రాజు, వెలుగు జ్యోతి ప్రధాన సంపాదకులు పెనుగొండ మండల మానవత అధ్యక్షులు నల్లిమిల్లి విజయరాజు, ఐటి ఇన్స్ట్రక్టర్ చెల్లుబోయిన భరత్, సాఫ్ట్ వేర్ ఇంజనీర్ యస్ అవిన్ చంద్, కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు బాలచందర్ కు అభినందనలు తెలియజేశారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

**జగ్గంపేట, పెన్ పవర్, జూలై10:** జగ్గంపేట మండలం కాట్రావులపల్లి శివారు చెరువు వద్ద బుధవారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. దీనికి సంబంధించి జగ్గంపేట పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాట్రావులపల్లి గ్రామానికి చెందిన మాదిరెడ్డి రవికిరణ్ బ్రహ్మదేవుడు గ్రామంలోని ఆల్కహాల్ ఫ్యాక్టరీలో రాత్రి పని ముగించుకుని ఉదయం తిరిగి సైకిల్ పై వస్తుండగా కాట్రావులపల్లి చెరువు వద్దకు వచ్చేసరికి ఎదురుగా మోటారుసైకిల్ వచ్చి ఢీకొట్టింది. దీంతో రవికిరణ్ ఎడమకాలు తొడ ఎముక విరిగి బలమైన గాయమైంది. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం జగ్గంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై రవికిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగ్గంపేట ఏఎస్ఐ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చదువులు సాగేదెల

**మారేడుమిల్లి, పెన్ పవర్, జులై, 10:-** గిరిజన ప్రాంతములో అర్భటంగా ఏర్పాటు చేసిన ఏకలవ్య గురుకుల పాఠశాలల్లో చదువులు ముందుకు సాగడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు ఇరవై ఐదు ఏకలవ్య గురుకుల పాఠశాలలు వున్నాయి. ఇటీవలే ఈ పాఠశాల ల కు శాశ్వత ప్రతిపధికానా ఉత్తరధి రాష్టాలకు చెందిన అధ్యాపకులు నియమించడం తో విద్యార్థిని, విద్యార్థులకు వీరి బోధన అర్ధం కాకా తలలు పట్టుకుంటున్నారు.విద్యార్థులకు అర్ధమయ్యే విధంగా బోధన కావాలని విద్యార్థులు, తల్లిదం డ్రులు మోర పెట్టుకుంటున్నారు. గతంలో పనిచేసిన తెలుగు అధ్యాపకులానే ఏకలవ్య గురుకులాల్లో తిరిగి నియమించాలని పలువురు విద్యావేత్తలు, స్థానికులు కోరుతున్నారు.

## వరకట్న వేధింపులపై కేసు నమోదు

**జగ్గంపేట, పెన్ పవర్, జూలై10:** వరకట్న వేధింపులపై బుధవారం జగ్గంపేట పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. దీనికి సంబంధించి జగ్గంపేట పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జగ్గంపేట మండలం రాజపూడి గ్రామానికి చెందిన పురందాసు శైలజకు పెద్దాపురంకు చెందిన పురందాసు రామకృష్ణతో వివాహం జరిగింది. వివాహ సమయంలో భర్త, అత్తమామలు, ఆడపడుచుకు కట్నం ముట్టచెప్పారు. వీరికి ఇద్దరు కుమార్తెలు సతానం ఉన్నారు. అయితే రామకృష్ణ ప్రతీ రోజూ మద్యం తాగొచ్చి అదనపు కట్నం కోసం అతని భార్యతో గొడవపెట్టుకుని వేధిస్తున్నాడు. దీనికి అత్తమామలు అప్పలరాజు, సోమరాజు, ఆడపడుచు వీరలక్ష్మి ప్రోత్సహిస్తున్నారు. అదనపు కట్నం కోసం భర్త పెట్టే బాధలు భరించలేక భార్య శైలజ జగ్గంపేట పోలీస్టేషన్లో ఫిర్యాదు చేసింది. దీనిపై ఏఎస్ఐ బి.సుబ్బారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ద

## మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం



**తాళ్ళపూడి, పెన్ పవర్, జులై 10:** తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జొన్నకూటి ఆధ్వర్యంలో బుధవారం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో మండలంలోని పలు శాఖల అధికారులు హాజరై శాఖాపరమైన పలు విషయాలను చర్చించారు. అదేవిధంగా వారి శాఖల ద్వారా జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ, ఎంపిడిఓ రమణ, తహశీల్దార్ శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తుప్పలు తొలగింపు పూర్తి చేయాలి...

చైర్ పర్సన్ రాణి.



**మండపేట. పెన్ పవర్. జూలై 10:** 20 వార్డు టిడ్కో ఇళ్ల వద్ద చేపట్టిన తుప్పల తొలగింపు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మండపేట పురపాలక సంఘం చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పేర్కొన్నారు.మండపేట పట్టణం 20వ వార్డు టిడ్కో గృహాల వద్ద జరుగుతున్న తొలగింపు పనులను బుధవారం మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ పి.లావణ్య,టిడ్కో సిబ్బంది, సచివాలయ సెక్రెటరీలు, శానిటేషన్ మెస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కులను హరించే నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయాలి: సునీత.



**ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 10:** కార్మికుల కోర్కెల దినోత్సవం సందర్భంగా సిఐటియు ఇచ్చిన పిలుపుమేరకు కార్మికులు మండల తాసిల్దార్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన కార్యక్రమాలు చేపట్టి ఎమ్మార్వోకి తమ డిమాండ్స్ తో కూడిన వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు ప్రాజెక్టు అధ్యక్షురాలు కాకరపల్లి సునీత మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, ఏనాటి నుంచో అపరిష్కృతంగా ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. ఈ కారణంగానే దేశ వ్యాప్తంగా సిఐటియు పిలుపుమేరకు అన్ని మండల కేంద్రాల వద్ద కోర్కెల దినోత్సవం నిర్వహిస్తున్నమన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టింది. కార్మికులుకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయకుండా కార్మికులను కట్టు బానిసలుగా చేయడానికి చూస్తుందని ఇది చాలా దారుణమని ఆవేదన చెందారు. తక్షణమే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్లో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలన్నారు. అంగనవాడి, ఆశ, మధ్యాహ్నం భోజనం, ఆర్ పి, వంటి స్కీం వర్కర్ల చేత సంవత్సరాల తరబడి సేవలు చేయించుకుని ఒక్క రూపాయి కూడా కేంద్ర ప్రభుత్వం వేతనం పెంచడం లేదని గుర్తు చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వీరిని వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులర్ చేయాలని , 26 వేల రూపాయలు కనీస వేతనంగా ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలు నిత్యం ఉపయోగించే మందులపై, వైద్య పరికరాలపై జి ఎస్ టి ని పూర్తిగా ఎత్తివేయాలని, సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్ ను పటిష్టంగా అమలు చేయాలని మహిళలు పనిచేస్తున్న అన్ని శాఖలలోనూ లైంగిక వేధింపుల నిరోధక కమిటీలను వేయాలని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు థర్డ్ పార్టీ ద్వారా జీతాలు ఇచ్చే విధానాన్ని రద్దుచేసి నేరుగా ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మోటారు కార్మికులకు ఉరితాడుగా కేంద్ర ప్రభుత్వం భారత న్యాయ సహిత చట్టం పేరుతో జూలై నెల ఒకటో తేదీ నుంచి అమలులోకి తీసుకు వచ్చిన చట్టం వలన ట్రాన్స్పోర్ట్ కార్మికులకు నష్టం వాటిల్లుతుందని ఈ చట్టాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని అన్నారు. ట్రాన్స్పోర్ట్, హమాలి, తోపుడు బళ్ళు, తదితర అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమం లో అంగన్వాడీల సెక్టర్ నాయకురాలు ఎన్ అమరావతి, ఎం నాగలక్ష్మి, పి నూక రత్నం, జి పార్వతి ,పి గంగాభవాని, పి దుర్గా, సూర్య కుమారి, వివో లీడర్ సత్యవేణి ఆశాల నాయకురాలు భవాని, సిహెచ్ వెంకటలక్ష్మి ,కే బంగారు పాప , మండలానికి చెందిన అంగన్వాడి వర్కర్స్ , హెల్పర్స్ ,ఆశాలు , వివో లు పాల్గొన్నారు.

# నియోజకవర్గ టిడిపి కన్వీనర్ గా అవకాశం ఇవ్వండి





**జీలుగుమిల్లి ,పెన్ పవర్ , జూలై 10 :**పోలవరం నియోజకవర్గం టిడిపి కన్వీనర్ గా అవకాశం ఇవ్వాలని ఏలూరు ఎంపీ పుట్ట మహేష్ కుమార్ యాదవ్ ని ఏలూరు జిల్లా టిడిపి అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు లను పద్దం వెంకటకృష్ణ కోరారు. బుధవారం ఏలూరు క్యాంపు కార్యాలయంలో వారిని కలిసి పూల బోకే ఇచ్చి శాలువాతో సన్మానించారు .ఈ సందర్భంగా పదం వెంకటకృష్ణ మాట్లాడుతూ మన్యం ఆదివాసి అభివృద్ధి సంఘం స్థాపించి ఏజెన్సీలో గిరిజనలు సమస్యలు పరిష్కరించి వారి అభివృద్ధికి తోడ్పడుతున్ననని అన్నారు .టిడిపి ఆవిర్భావం నుండి ఇప్పటివరకు పార్టీ కోసం పనిచేస్తున్నానని అన్నారు .ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ,రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు పల్ల శ్రీనివాసుని కూడా కలిసి నియోజకవర్గ కన్వీనర్ గా అవకాశం ఇవ్వాలని కోరినట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ కి గన్ని వీరాంజనేయులు కి వివరించానని తెలిపారు . అదేవిధంగా నియోజకవర్గంలోని ఏడు మండలాల లో టిడిపి నాయకులు కార్యకర్తలతో నాకు మంచి సంబంధాలు ఉన్నట్లు వారికి తెలిపానని అన్నారు .పుట్ట మహేష్ కుమార్ యాదవ్ ,గన్ని వీరాంజనేయులు సానుకూలంగా స్పందించి పార్టీ అధిష్టా నం దృష్టికి తీసుకువెళతా మనీ అన్నారని తెలిపారు. ఎంపీ ని కలిసిన వారిలో టిడిపి సీనియర్ నాయకులు మోడియం సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# బైక్ చోరీపై కేసు నమోదు

**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 10:** బైక్ చోరీపై బుధవారం జగ్గంపేట పోలీస్టేషన్లో కేసు నమోదైంది. దీనికి సంబంధించి జగ్గంపేట పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జగ్గంపేట మండలం రామవరం గ్రామానికి చెందిన లింగంశెట్టి లక్ష్మీనారాయణ యొక్క ఏపీ39 జేఆర్9891 నంబరు గల పల్సర్ బైక్ జూన్ 29వతేదీన సాయంత్రం రామవరం గ్రామ శివారులోని అతని పొలం వద్ద పార్కు చేసి పొలంలోకి వెళ్లారు. తిరిగి పది నిమిషాల్లో వచ్చేసరికి రోడ్డుపై పార్కు చేసిన బైక్ కనిపించలేదు. అప్పటి నుంచి చుట్టు పక్కల ప్రాంతాల్లో ఎంత వెతికిన కనిపించకపోవడంతో బుధవారం జగ్గంపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు జగ్గంపేట హెడ్ కానిస్టేబుల్ ముజబుద్దీన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నారు.

# ఈది రామారావు చిరస్మరణీయుడు.





● రామారావు స్మారక స్తూపం ప్రారంభోత్సవ సభలో ప్రశంసలు

**పోడూరు, పెన్ పవర్, జులై-10:** పోడూరు గ్రామవాసి ఈది రామారావు(స్టీఫెన్) చిరస్మరణీయుడని సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంతెన సీతారాం అన్నారు. పోడూరులో బుధవారం స్టీఫెన్ స్మారక స్తూపం ప్రారంభోత్సవం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బి. బలరాం, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, జిల్లా కార్యవర్గసభ్యుడు కేతాగోపాలన్, సర్పంచి శెట్టిబత్తుల సువర్ణరాజు, కుటుంబ సభ్యులు తదితరులు. మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి, ప్రజాసమస్యల పోరాటానికి సిపిఎం ఆధ్వర్యంలో పోరాట పఠిమ చూపిన నిస్వార్థ ప్రజాసేవకుడు స్టీఫెన్ అన్నారు. కొన్ని దశాబ్దాలు తరబడి వ్యవసాయ కార్మిక సంఘంలో ముఖ్య నాయకుడిగా పనిచేసి కూలీల వేతనాల పెంపు, దళితుల ఇళ్ల స్థలాల కోసం పోరాడి ప్రజల తరుపున ఉద్యమాలు చేశారన్నారు. నినాదాల వెనుక ఎవరికి మేలు జరుగుతుందో గుర్తించనంత సేపు మోసపోతూనే ఉంటారని నమ్మిన వ్యక్తి అన్నారు. సిపిఎం పార్టీలకు, మతాలకు, కులాలకు అతీతంగా పనిచేస్తుందని పార్టీ ఆశయ సాధనకు కృషి చేసినవారిలో ముఖ్యుడు స్టీఫెన్ అని కొనియాడారు. ఆయన ఉద్యమ స్ఫూర్తిని పార్టీ మర్చిపోదన్నారు. అందరి హృదయాల్లో సజీవంగా ఉన్నారనే దానికి చిహ్నంగా స్తూపం ఏర్పాటు చేయడమైనదన్నారు. వ్యవసాయ ఉద్యమాల్లో అలుపెరగని పోరాటం చేసి ఎర్రజెండా స్ఫూర్తిని జిల్లా నలుదిశల వ్యాప్తి చేసిన స్టీఫెన్ అమరజీవి అయ్యారన్నారు. ఆయన శతజయంతి ఉత్సవాన్ని జరుపుకోవడం, స్తూపం వేడుకల్లో హాజరుకావడం సంతోషదాయకమని, శుభ పరిణామమని ప్రశంసించారు. ఆచంట వేమవరం గ్రామానికి చెందిన సిపిఎం పార్టీ ఉద్యమకారుడు బసన మల్లయ్య స్తూపాన్ని త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. స్టీఫెన్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఆయన గురించి తెలిసింది కొంచెమేనని, ప్రముఖులు మాట్లాడుతుంటే తమకెంతో గర్వంగా ఉందని ఆనందాన్ని వెలబుచ్చారు. 101 సంవత్సరాల వృద్ధుడు, సిపిఎం సీనియర్ నాయకుడు, కడలి వెంకన్న తన స్వగ్రామం మైన పండితవిల్లూరు నుంచి కాలినడకన కార్యక్రమానికి విచ్చేశారు. ఆ ఆ వృద్ధుడిని నాయకులు దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ, మండల నాయకులు బూరాబత్తుల వెంకట్రావు, బొంతు శ్రీను, కాకర వెంకటేశ్వర్లు, సిపిఎం అనుబంధ సంఘాల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# నారుమడులు, వరినాట్లపై శ్రద్ధ వహించాలి. ఏడీఏ పార్వతి

- నీటి ఎద్దడి ఉంటే సిబ్బంది దృష్టికి తీసుకురావాలి
- కౌలురైతులు దరఖాస్తులను సంబంధిత వీఆర్వోలకు అందజేయాలి



**పోడూరు, పెన్ పవర్, జులై-10:** నారుమడులు, వరినాట్లు వేసేటప్పుడు, రైతులు శ్రద్ధ వహించి జాగ్రత్తలు పాటించాలని పాలకొల్లు వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు (ఏడీఏ) ఎ పార్వతి సూచించారు. పోడూరు మండలంలో కవిటం, పండితవిల్లూరు, తూర్పుపాలెం గ్రామాల్లో బుధవారం పోడూరు మండల వ్యవసాయాధికారి(ఏవో) జి. సత్యనారాయణతో కలిసి నారుమడులు, వరినాట్లను క్షేత్రస్థాయి పర్యటన చేసి రైతులకు పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు నారుమడి విషయంలో శ్రద్ధ వహించాలన్నారు. వరినారు తీయుటకు వారం రోజులు ముందర నారుమడి (5 సెంట్లు) లో 1కేజీ 3జీ కార్బోఫ్యూరాన్ గుళికలు వేయాలన్నారు. నాట్లు వేసేటప్పుడు తప్పనిసరిగా నారు చివర్లను త్రుంచి నాట్లు వేయాలని సూచించారు. నత్రజనిని బురద పదునుపై దఫదఫాలుగా వేసుకోవాలన్నారు. కౌలురైతులు అందరూ కౌలుకార్డుల కోసం దరఖాస్తులను వీఆర్వోలకు అందజేయాలని స్పష్టం చేశారు. మండలంలో నీటి ఎద్దడి సమస్యలుంటే సిబ్బంది దృష్టికి తీసుకురావాలన్నారు. ఏవో సత్యనారాయణ మాట్లాడుతూ ఖరీఫ్ వరినాట్లను త్వరగా పూర్తి చేయాలని' స్పష్టం చేశారు. దీంతో నవంబరు, డిసెంబరు తుపానుల ప్రభావం పంట ఉండదన్నారు. తద్వారా రబీ సాగు ముందుకు రావడంతో చివర్లలో తుపాన్ల కారణంగా వర్షాభావ పరిస్థితి నుంచి బయట పడవచ్చాన్నారు. అనంతరం వీఏఏలకు సమీక్ష నిర్వహించారు. రైతులకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో ప్రియాంక, వీఏఏలు నర్సింహమూర్తి, పి. ప్రభాకర్, మరియు రైతులు పాల్గొనడం జరిగింది.

# మానవ సేవకు బౌద్ధంలో అధిక ప్రాధాన్యత

శ్రీలంక బౌద్ధ భిక్షువు రెవ బోధిహీన



**అయినవిల్లి/అమలాపురం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, జూలై 10:** ప్రపంచ శాంతి, సర్వమానవ సంక్షేమాన్ని కాంక్షించే బౌద్ధంలోని అష్టాంగ మార్గాల్లో సేవ,సహాయాలు ఒకభాగమని శ్రీలంక బౌద్ధ సన్యాసి, తెలుగు శ్రీలంక జనతా ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ రెవ. బోధిహీన అన్నారు.కరోనా విపత్కర పరిస్థితుల్లో అయినవిల్లి మండలంలోని కె. జగన్నాధపురంలోని తన స్వంత ఇంటినే క్వారంటైన్ హౌస్ గా మార్చి, సుమారు 150 పైగా కరోనా మృత కళేబరాల అంత్యక్రియల్లో స్వయంగా పాల్గొని బాధిత కుటుంబాలకు అండగా నిలిచి చేయుతనందించడం చాలా సాహసోపేతమైనదని కరోనా వారియర్స్ గా ప్రజల మదిలో నిలిచారన్నారు గంగుమళ్ళ కాశీ అన్నపూర్ణ శ్రీనివాస్ ల స్వగృహాన్ని ఆయన సందర్శించారు.ఆ సమయంలో జాతీయ మీడియా ద్వారా ఈ విషయాన్ని తెలుసుకుని తమ ఆరామంలోని భిక్షువులంతా చాలా సంతోషం చెందామని వివరించారు.మానవ సేవే మాధవ సేవ అని బోధించిన బౌద్ధ సిద్ధాంతాన్ని ఆచరించిన ఈ గృహం ఒక దేవాలయంతో సమానమని ఆయన పేర్కొన్నారు.శాంతి,అహింస,సత్యాన్వేషణ దిశగా ప్రపంచాన్ని పయనింపచేయటంలో బౌద్ధం విశేషకృషి చేస్తోందని ఆయన తెలిపారు.గంగుమళ్ళ శ్రీనివాస్ దంపతులు ఏర్పాటు చేసిన భిక్షను స్వీకరించి స్థానికులకు ఆశీర్వచనాలు అందించారు.ఈ కార్యక్రమంలో గనిశెట్టి గోవిందరాజులు,వల్లభరెడ్డి సూరిబాబు,నల్లా సత్తిబాబు,నల్లా సందీప్ కొప్పిశెట్టి వీరబాబు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



**పెద్దాపురం, పెన్ పవర్, జూలై 10:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆవిర్భావ దినోత్సవాన్ని పెద్దాపురం పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేట్ స్టూడెంట్ ఫర్ డెవలప్ మెంట్ కోకన్వీనర్ కె. లలిత్ కుమార్ మాట్లాడుతూ 75 ఏళ్లుగా ఏబీవీపీ ఎన్నో విద్యారంగ సమస్యలపై పోరాటం చేసిందన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో ప్రారంభమైన ఏబీవీపీ దేశం నలుమూలలా విస్తరిస్తూ 50 లక్షల పైబడి సభ్యత్వంతో ప్రపంచంలోనే అతి పెద్ద విద్యార్థి సంస్థగా ఎదిగిందని తెలిపారు. ఎన్నో ఆటుపోట్లు ఎదురైనా అధిగమిస్తూ ఎన్నో విజయాలు సాధించిందన్నారు. భవిష్యత్తులోనూ ఏబీవీపీ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తుందని ఆయన తెలిపారు. ఈ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా స్థానిక లెమ్స్ పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

# రైతులకు నికర ఆదాయం పెరగాలి

-డీఏఓ విజయ్ కుమార్



**కాజులూరు,పెన్‌పవర్,జూలై10:** రైతులకు నికర ఆదాయం పెంచేందుకు వ్యవసాయ సహాయకులు పనిచేయాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏవో)ఎన్.విజయ్ కుమార్ అన్నారు.బుధవారం మండల పరిధిలోని గొల్లపాలెం గ్రామంలో కాజులూరు,తాళ్లరేవు మండలాల వ్యవసాయ సహాయకులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ సంధర్భంగా డీఏవో మాట్లాడుతూ రైతులకు ఎప్పటికప్పుడు ఆధినిక ,సాంకేతిక సలహాలతో రైతుల నికర ఆదాయం పెంచేవిధంగా పనిచేయాలని సూచించడం జరుగుతుందన్నారు.దానికి సంబంధించి పొలంబడి కార్యక్రమాన్ని సక్రమంగా ఉపయోగించుకోవాలని కోరారు.ఉప్పటికప్పుడు రైతులకు తెగుళ్ల పురుగుమందు వాడకంలో సూచనలు సలహాలు చూస్తూ సాగు ఖర్చులు తగ్గించాలన్నారు.ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కె.బాబూరావు ,మండల వ్యవసాయ అధికారి వి.అశోక్, మండల వ్యవసాయ అధికారి ప్రశాంతి.కాజులూరు,తాళ్లరేవు గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ర్యాలీ




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జులై 10:** కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనం నుండి ఆర్.డి.ఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఆర్.డి.ఓకు వినతిపత్రాన్ని సమర్పిం చారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు మాట్లాడుతూ ఎన్నికల అనంతరం దేశంలో, రాష్ట్రంలో నూ తన ప్రభుత్వాలు ఏర్పడ్డా యని,ఈ ప్రభుత్వాలు కార్మిక సమస్యల ను వెంటనే పరిష్కరిస్తారని కార్మికులు ఆశించారని తెలిపారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే బిజెపి ప్రభుత్వం ప్రావిడెంట్ ఫండ్ సకాలంలో చెల్లించని యజమానులకు వేసే జరిమానా పై 25శాతం నుండి 5 శాతం తగ్గించిందని వారు వాపోయారు. దీనివల్ల యజమానులకు పిఎఫ్ బకాయిలు సకాలంలో చెల్లించకుండా జాప్యం చేస్తారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్ లను అమలు చేసే దస్త్రాన్ని కేంద్రం కదిలి స్తుందని వారు అన్నారు. లేబర్ కోడ్ లు అమలు జరిగితే నేడు ఉన్న చట్టాల సారం అంతా పోతుందని, సమ్మెలు చేయడం కూడా సాధ్యం కాదని వారి ఆవేదన వ్యక్తం చేశారు. పనివేళలు పెంచడం ఉన్న హక్కులు తొలగించడం, జీతాలు పెంచక పోవడం, నిర్బంధాన్ని తీవ్రతరం చేయడం యజమానులకు తేలిక అవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని, ప్రైవేటీకరణ, జాతీయ నగదు బదిలీకరణ పథకం ఆపాలని కోరారు. ఈ కార్యక్రమానికి సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శు లు జవ్వాది శ్రీను,కరెడ్ల రామకృష్ణ, సత్తి కోదండ రామిరెడ్డి,చల్లా చంద్రరావు, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, గొర్రెల సతీష్ కుమార్,నరమాల కృష్ణ, మేట్రేడ్డి రమణ,పులిమంతుల రమణ,కుంచంగి నానాజీ,ఏపూరి శ్రీను, అంగన్వాడీ,ఆశా,మిడ్డేమిల్స్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com

## జగన్మోహిని కేశవ స్వామి కి విరాళం



**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 10:** ర్యాలి గ్రామంలో వెలిసిన పురాతనమైన దేవాలయం శ్రీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయం ఈ ఆలయానికి రాష్ట్ర నలదిక్కుల నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి దేశాల నుండి తరలివస్తారు. ఈ స్వామి వారికి ఒక విశిష్ట కలిగి ఉంది ముందు కురిసిన రోబో వెనక స్త్రీ రూపం లో భక్తులకు దర్శనం ఇస్తారు. స్వామివారి రెండు పాదాల మధ్య నుండి నిత్యం గంగా ఉభవిస్తుంది.బుధ వారం స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు స్వామివారి దర్శనం అనంతరం ఆలయ సన్నిధిలో జరిగే అన్నదాన పథకానికి విరాళాలు సమర్పించారు.తాళ్లరేవు మండలం జార్జి పేట గ్రామానికి చెందిన స్వర్ణ శ్రీనివాస భాస్కర్ జానకి దంపతులు 5,000 రూ,విరాళం సమర్పించారు వీరిని ఆలయ వేద పండితులు ఆశీర్వచనాలు అందించగా ఆలయ సిబ్బంది స్వామి వారి చిత్రపటాన్ని చరిత్ర కలిగిన పుస్తకం శేష వస్త్రంతో సత్కరించారు.

## హెల్మెట్ వినియోగంపై అవగాహనా ర్యాలీ



**పెద్దాపురం, పెన్ పవర్, జూలై 10 :** హెల్మెట్ వినియోగంపై పెద్దాపురం పట్టణంలో బుధవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. రవాణా, పోలీసు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీసులు, న్యాయవాదులు, తదితరులు హెల్మెట్‌లు ధరించి పట్టణంలోని ప్రధాన వీధులు గుండా ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని డీఎస్పీ కె. లతాకుమారి జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో డిఎస్పీ మాట్లాడుతూ వాహనచోదకులు హెల్మెట్‌ను ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడపటం వలన ఒక రక్షణ కవచంలా ఉపయోగపడుతుందని అన్నారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటిస్తూ హెల్మెట్‌ను ధరించి ప్రయాణం చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఎస్ఐ వెలుగుల సురేష్, మోటార్ వెహికల్ ఇనస్పెక్టర్లు ఎం. హరనాథరెడ్డి, డి. శ్రీకాంత్ బాబు, శ్వేతసాయి, సాయిబాబు, రవి, జిల్లా మానవ హక్కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ, న్యాయవాదులు మడికి రాంబాబు, సకురు దుర్గారావు, అత్తిలి ప్రభూజీ, తదితరులు పాల్గొన్నారు.

## పొలంబడి ద్వారా ఉత్తమ వ్యవసాయ పద్ధతులు

- మండల వ్యవసాయాధికారి కొమ్మోజు సంజయ్ కుమార్



**పెద్దాపురం, పెన్ పవర్, జూలై 10 :** రైతులు ఉత్తమ వ్యవసాయ పద్ధతులు పాటించి, తద్వారా నాణ్యమైన దిగుబడులు పొందేందుకు పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు మండల వ్యవసాయాధికారి కొమ్మోజు సంజయ్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని కట్టమూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి సంజయ్ కుమార్ మాట్లాడుతూ సాగులో వస్తున్న శాస్త్రీయ పద్ధతులు, ఎరువులు, పురుగుమందులు వినియోగం తదితర అంశాలపై రైతులను చైతన్యపర్చేందుకు పొలంబడి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. 14 వారాల పాటు నిర్వహించే పొలంబడి కార్యక్రమంలో రైతులకు శిక్షణ అందించడంతో పాటు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు, రాయితీలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. రైతులకు దిక్సూచిగా పొలంబడి కార్యక్రమం నిలుస్తుందని, రైతులంతా పొలంబడిలో చేరి మేలైన పద్ధతుల ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం 25 మంది పొలంబడి రైతులు, ఐదుగురు ఇతర రైతులను ఎంపిక చేసి బేస్ లైన్ సర్వే చేసి ప్రీ బ్యాలెట్ టెస్ట్ నిర్వహించారు. అలాగే పొడి విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమలో మేడిది శ్రీనివాస్, అడపా గంగాధరం, మాదిరెడ్డి రామకృష్ణ గారు, పోసిన సుబ్బారావు, కె. పాపారావు, పి. నాగేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు విజయదుర్గ, అమృత, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.


## మరిడమ్మ దేవస్థానంలో మఖ నక్షత్ర పూజలు



**పెద్దాపురం, పెన్ పవర్, జూలై 10 :** పెద్దాపురం పట్టణంలో కొలువై ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం మరిడమ్మ దేవస్థానంలో మఖ నక్షత్రం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారి గర్భాలయంలో ఉన్న మూలవిరాట్టుకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించి సుగంధభరితమైన వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాలు నడుమ శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ పూజా కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ చేబ్రోలు రామ్మోహనరావు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు సత్కారం





**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 10:** స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను రాష్ట్ర ఐక్య కాపునాడు అధ్యక్షులు వాదా ప్రసాదరావు, వర్కింగ్ ప్రెసిడెంట్, గాదంశెట్టి కొండలరావు (మునసీబు) ఉపాధ్యక్షులు తుమ్మల శ్రీరామ్మూర్తి, తదితర సంఘ నేతలు కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు కాపుల సమస్యలపై ఎమ్మెల్యే నెహ్రూకు వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వంలో కాపులకు ఎక్కడ న్యాయం జరగలేదని తెలుగుదేశం పార్టీ ద్వారానే మళ్లీ కాపులను న్యాయం చేయాలన్నారు. బీసీల్లో చేర్చే అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి కాపులను న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుల అడపా ప్రకాష్ నాయుడు, గుండు వీర తాతారావు, గండి కిషోర్ , జగ్గంపేట కాపు జేఏసీ అధ్యక్షులు ధవులూరి ఈశ్వరరావు, తోలేటి సూర్యనారాయణ, లోకా రెడ్డి అప్పన్న దొర, మారిశెట్టి రాధా, పుర్రె సూరన్న, ఇళ్ల ముద్దాజీ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జగ్గంపేట సంజీవి ఫిషర్ మెన్ సొసైటీ సంఘానికి చెందిన 40 మంది సభ్యులు, జగ్గంపేట గ్రామపంచాయతీ 17 వ వార్డు సభ్యులు కందరాడ చంద్రరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నెహ్రూ కు సాలువా కప్పి ఘనంగా సత్కరించారు. 50 సంవత్సరాల నుంచి సొసైటీ సంఘ సభ్యులుగా జీవనం సాగిస్తున్నామని ప్రభుత్వం ద్వారా చేపలు పట్టుకోవడానికి చేపలు అమ్ముకోవడానికి వలలు, ట్రైలు, మోటార్ సైకిల్, ఆర్థికంగా బ్యాంకుల ద్వారా లోన్లు ఇప్పించి చెరువులు బాగు చేసుకోవడానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు ఉంగరాల జీవరత్నం, కడితి ప్రసాద్, సలాది భూషణం, కలవల అప్పారావు, గుల్లా రాజబాబు, కడితిలాజర్, మర్ల యేసు, మర్ల ప్రకాష్, బూర చక్రం తదితర ఫిషర్ మాన్ సభ్యులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



**గండేపల్లి, పెన్ పవర్ జూలై 10:** అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ గండేపల్లి తహసిల్దార్ చిరంజీవి కి వినతిపత్రం అందజేశారు. బుధవారం అంగన్వాడీల కోర్కెల దినోత్సవం పురస్కరించుకొని తమ న్యాయమైన కోర్కెలు నెరవేర్చాలని మండలంలో అంగన్వాడీలు కోరారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు మేరకు అంగన్వాడీలకు గ్రాడ్యుటీ అమలు చేయాలని

తదితర డిమాండ్లు నెరవేర్చాలన్నారు. గత ప్రభుత్వం అంగన్వాడీలను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైవి రాజేశ్వరి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## లేబర్ కోడ్లను అమలు చేయాలి :సిఐటియు



**పెనుమంట్ర,పెన్ పవర్,జులై 10:**కేంద్ర ప్రభుత్వం యజమానులకు అనుకూలంగా, కార్మికులు వ్యతిరేకంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయకుండా హెచ్చరించడానికే దేశవ్యాప్తంగా డిమాండ్స్-డే ని కార్మికుల నిర్వహిస్తున్నారని సిఐటియు పెనుగొండ మండల అధ్యక్షుడు నాగిశెట్టి గంగారావు అన్నారు. బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో పెనుగొండ మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద స్కీం-వర్కర్లు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్లు, ధర్నా నిర్వహించి తహసిల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గంగారం మాట్లాడుతూ మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ప్రజల ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు లీజుకు ఇవ్వడం ఆపాలని డిమాండ్ చేశారు. అంగన్వాడి, ఆశా మధ్యాహ్న భోజన పథకం, ఐకెపి యానిమేటర్లను కార్మికులు గా గుర్తించి వారికి కనీస వేతనాలు రూ. 26000 చెల్లించాలని, భద్రతా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ప్రభుత్వాలను కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యకాసం నాయకులు షేక్ పాదుషా అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకురాలు కే తులసి, ఐకెపి వర్కర్స్ నాయకులు పాల్గొన్నారు.

## పశుగ్రాసాల సాగు ద్వారా అధిక పాల దిగుబడి





జూనియర్ వెటర్నరీ అధికారి పి. అప్పన్నబాబు

**గంగవరం, పెన్ పవర్, జూలై 10:** మేలైన పశుగ్రాసాలు సాగుచేసి వాటి ద్వారా వచ్చే గ్రాసాలు పశువుల కు మేపడం ద్వారా అధిక పాల దిగుబడి సాధించవచ్చునని నెల్లిపూడి గ్రామీణ పశువైద్యశాల జూనియర్ వెటర్నరీ అధికారి పరిశిక అప్పన్నబాబు రైతులు కు సూచించారు. పశు గ్రాసవారోత్సవము లో భాగంగా మొల్లేరు లో రైతులకు పశుగ్రాసాలు వాటి ప్రాముఖ్యత గురించి వివరించి వాటిని సాగు విధానము, అనావృష్టికాలములో పశుగ్రాసాల నిల్వ యుంచు విధానం గురించి వివరించారు. రైతులకు పశుగ్రాసవిత్తనాలు సబ్సిడీ పై పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ మండల ప్రెసిడెంట్ పాము అర్జున్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను రైతులు సద్వినియోగం చేసుకొని తద్వారా ఆర్థికాబివృద్ధి సాధించాలని కోరారు. పశు గ్రాసవిత్తనాలు సకాలంలో అందించాలని ఉప సంచాలకుల వారిని చరవాణి ద్వారా కోరారు. ఈ కార్యక్రమంలో గంప కొండబాబు, తలారి పాపారావు, రైతులు సిబ్బంది అనంతలక్ష్మి, తరుణ్, నవ్య, చిన్నబాబు, క్రాంతి, పాల్గొన్నారు.

## భవిత కేంద్రాన్ని సందర్శించిన విద్యాశాఖ అధికారులు.





**ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 10:** స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం చెంతనే ఉన్న భవితా కేంద్రాన్ని విద్యాశాఖ అధికారులు రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ వై నరసింహం, జిల్లా సహిత విద్య సమన్వయకర్త చామంతి నాగేశ్వరరావులు బుధవారం సందర్శించి పరిశీలించారు. భవిత కేంద్రంలో పిల్లలు కంప్యూటర్ను ఆపరేట్ చేయడం, టైపు చేయడం, రంగురంగుల బోధనా ఉపకారణాలను ఉపయోగించి విద్యను బోధించడం పట్ల ఉపాధ్యాయులను అభినందించారు. పిల్లల యొక్క తల్లిదండ్రులు స్కూలులో టైలరింగ్ చేయడం పట్ల అధికారులు సంతోషం వ్యక్తం చేశారు. పిల్లలు ట్యాబ్ ద్వారా పాఠాలు నేర్చుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. అలాగే ఫిజియోథెరపీ సైకిల్ ప్రతిరోజు పిల్లలు తొక్కడం వలన వారి నడకలో మార్పును గమనించారు. స్కూలులో రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. పిల్లల తయారు చేసిన పేపర్ బొకేలు, పువ్వులు అధికారులు చూసి సంతోషం వ్యక్తం చేశారు. భవిత పిల్లలను ప్రయోజకులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్న టీచర్లు సిహెచ్ వాణి పద్మజ, పి బుజ్జి , ఎం రమణ, దివ్య, వెంకటలక్ష్మిలను అధికారులు అభినందించారు. ఈ సందర్శనలో వారి వెంట ఎంఈఓ వరలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

## పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా విద్యాశాఖాధికారి



**పెద్దాపురం, పెన్ పవర్, జూలై 10 :** మండల పరిధిలోని కాండ్రకోటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల పరిసర ప్రాంతాలను తరగతి గదులను సందర్శించారు. పాఠశాలలో విద్యాబోధన సంబంధిత అంశాలను విద్యార్థులను అడిగి తెలుసుకుని, వారి కనీస అభ్యసన స్థాయిలను పరీక్షించి అసంతృప్తి వ్యక్తం చేశారు. చదువులో విద్యార్థులు వెనుకబడడంపై మండల విద్యాశాఖ అధికారులపై డీఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై అందరూ సమైక్యంగా విద్యాభివృద్ధికి తోడ్పడాలని, నూతనంగా మంజూరైన హైస్కూల్ ప్లస్ ను వినియోగించుకోవాలని ఆయన ఆదేశించారు.

## బడిఈడు పిల్లలను పనికి పంపించద్దు




**గండేపల్లి, పెన్ పవర్, జూలై10 :** బడి ఈడు పిల్లలను పనికి పంపించి వారి జీవితాన్ని నాశనం చేయొద్దని టీడీపీ మండల యువనాయకుడు ఉప సర్పంచ్ జాస్తి వసంత్ అన్నారు. బుధవారం హెచ్ఎం అమ్మాజీ ఆధ్వర్యంలో నేను బడికి పోతా అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉపసర్పంచ్ వసంత్ హాజరై మాట్లాడుతూ చదువుకునే పిల్లలకు పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. పిల్లలను బడికి పంపించి వారి బంగారు భవిష్యత్తు కు బాటలు వేయాలన్నారు. అనంతరం గ్రామమంతా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుక్కల ఆనందబాబు, ఉండవిల్లి బుల్లిరాజు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొ న్నారు.

## కూటమి నాయకులు ఉచిత ఇసుక పై సమావేశం



**పెనుమంట్ర, పెన్ పవర్,జూలై-10:**రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానం వల్ల సామాన్యుల భారీ ఊరట లభించిందని కూటమి నాయకుల అన్నారు. బుధవారం మండలంలోని మార్టేరు శ్రీ వేణుగోపాల ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో ఆచంట నియోజకవర్గ కూటమి నాయకుల ఉచిత ఇసుక పాలసీ పై సమావేశం టిడిపి నేత బుల్ల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీని చంద్రబాబు అధికారంలోకి వచ్చి నెల రోజుల లోపే అమలు చేశారన్నారు. ఫ్రీ శాండ్ పాలసీ అమలు చేస్తూ జీవో నెంబర్ 43 విడుదల చేయడం రాష్ట్ర ప్రగతికి బాటలు వేసిందన్నారు. ఇసుక మాఫియాతో వైకాపా ప్రభుత్వం కోట్లు కొల్లగొట్టిందని విమర్శించారు. వైసీపీ నేతలు మింగేసిన ఇసుకతో దాదాపు పది లక్షలకు పైగా ఇళ్లు కట్టొచ్చుంటే వారి అవినీతి ఏ స్థాయిలో అవినీతి చేశారో అర్థం చేసుకోవచ్చన్నారు.
జిల్లాల స్థాయిలో శాండ్ కమిటీలు ఏర్పాటు చేసి కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవోలు, మైనింగ్ అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తమనంపూడి శ్రీనివాస్ రెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు కేహెచ్ వి ప్రసాద్ రెడ్డి, నాయకులు రామ్మోహన్. తదితరులు పాల్గొన్నారు.

# కమాండ్ కంట్రోల్ రూమ్ పునరుద్ధరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలి-జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి




**కాకినాడ.పెన్ పవర్ జులై 10 :**కాకినాడ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ (కేఎస్‌సీసీఎల్) ద్వారా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ పునరుద్ధరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, కేఎస్‌సీసీఎల్ ఛైర్‌పర్సన్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ లో కేఎస్‌సీసీఎల్ 43వ డైరెక్టర్ల బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ షాన్ మోహన్.. కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్, కేఎస్‌సీసీఎల్ సీఈవో, ఎండీ జె.వెంకటరావుతో కలిసి స్మార్ట్ సిటీ ప్రోజెక్ట్ పనులు పై సమీక్షించారు. తొలుత కేఎస్‌సీసీఎల్ ద్వారా చేపట్టిన పనుల పురోగతి, ఇంతక ముందు డైరెక్టర్ల బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలును సమీక్షించారు. అనంతరం సమ్మిళిత, సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా స్మార్ట్‌సిటీ మిషన్ ప్రాజెక్టు క్రింద ఇప్పటి వరకూ పూర్తయిన పనుల వివరాలు, ప్రస్తుతం జరుగుతున్న పనుల ప్రగతి పై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కాకినాడ పట్టణాన్ని ఆకర్షణీయ నగరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. కాకినాడ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ కు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.194.42 కోట్లు రావలసి ఉందన్నారు. కేఎస్‌సీసీఎల్ ప్రాజెక్టు కింద వివేకానంద పార్క్ వద్ద ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ పునరుద్ధరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. అదేవిధంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా 40 టీపీడీ కెపాసిటీ బయో-మెథనేషన్ ప్లాంట్ (వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్) నిర్మాణం, సరఫరా, ఇన్‌స్టాలేషన్, స్థలాన్ని చొల్లంగి నుంచి దుమ్ములపేటకు మార్చడం వంటి అంశాలపై పూర్తి నివేదిక సమర్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు, సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.వెంకటరావు, కేఎస్‌సీసీఎల్ డైరెక్టర్, జేఎన్టీయూ ప్రొఫెసర్ డా. జేవీఆర్.మూర్తి, స్వతంత్ర డైరెక్టర్ టీవీఎస్ కృష్ణకుమార్, కంపెనీ సెక్రటరీ ఎం.ప్రసన్నకుమార్, ఈఎన్సీ పబ్లిక్ హెల్త్ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

# డ్వాక్రా యానిమేటర్ పై విచారణ.



**ఆలమూరు, పెన్ పవర్, జూలై 10:**ఆలమూరుకు చెందిన డ్వాక్రా యానిమేటర్ శిరోమణి పై వివిధ గ్రూపులకు చెందిన సభ్యులు ఇచ్చిన ఫిర్యాదులపై ఉన్నతాధికారులు స్పందించారు.బుధవారం స్త్రీ నిధి ఏజీఎం ప్రసన్నలక్ష్మి ,ఉన్నతి డిపిఎం ఎం శామ్యూల్ ఆలమూరు వచ్చి విచారణ జరిపారు. శిరోమణి నిర్వహణలో ఉన్న 59 గ్రూపులకు గాను 13 గ్రూపులకు సంబంధించి ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా తీసుకున్న ఉన్నతి రుణాల రికవరీ కి సంబంధించి రూ 3.73 లక్షలను ఆమె సంఘాల నుంచి వసూలు చేసి బ్యాంకులకు జమ చేయకుండా నిధులు దుర్వినియోగం చేసినట్లు నిర్ధారణ చేశారు. ఆ నిధులను సొంత అవసరాలకు వాడుకున్నట్లు ఆ మొత్తాన్ని తాను తిరిగి చెల్లిస్తానని శిరోమణి అంగీకరించినట్లు అధికారులు తెలిపారు.

# ఆచంట వేమవరంలో ఏక్ పేడ్ మాకే పర్ కార్యక్రమం



**పెనుమంట్ర, పెన్ పవర్,జూలై-10:**ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు ఏక్ పేడ్ మాకే పర్ కార్యక్రమంలో భాగంగా ఆచంట వేమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నెక్కంటి కృష్ణ వేణి ఆధ్వర్యంలో ఫల ,పుష్ప వృక్షాలను రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ( ఎస్ టి యు) ఆచంట శాఖ దాతృత్వంతో పంపిణీ చేసి పాఠశాల ఆవరణములో వివిధ ప్రదేశమునందు ఒక పండగ వాతావరణం గా మొక్కలను నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి నేక్కంటి కృష్ణవేణి మాట్లాడుతూ స్థిరమైన జీవనానికి దోహదపడే మొదటి అడుగు పర్యావరణానికి ఏదైనా తిరిగి ఇవ్వటం అని అన్నారు. విద్యార్థులు అందరూ తల్లి పేరు మీద ఒక చెట్టు నాటండి అని పిలుపునిచ్చారు. మొక్కలు బహుకరించిన ఎస్ టి యు ఆచంట శాఖ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆచంట శాఖ సెక్రటరీ బండి ప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత కొరకు వృక్షాలను నాటి భావితరాలను పరిరక్షించ వలసినదిగా మానవాళి అభివృద్ధి పేరుతో విచక్షణారహితంగా చెట్లు నరికి వేసి సమీప భవిష్యత్ లో ఆక్సిజన్ కొనే పరిస్థితి వస్తుందని అన్నారు. కాబట్టి ప్రతి విద్యార్థి తల్లి పేరుతో ఒక మొక్క నాటండి. అన్నారు ఈ కార్యక్రమంలో వై సుధాకర్ బాబు, పాఠశాల సెక్రెటరీ ఈడీవీ ప్రసాద్, కట్ట మల్లికార్జున శ్రీనివాసరావు, పిడి మాత మహాలక్ష్మి, చల్లా సుజాత, వేగేశ్న త్రివేణి, బి ఎస్ ఎస్ ఆర్ మూర్తి, కేశవరపు రమేష్ బాబు , ఎస్ టి యు జిల్లా ఉపాధ్యాయ సంఘ నాయకులు కేసి రాజు కృష్ణ, ముత్తాబత్తుల త్రిమూర్తులు, మండల ప్రెసిడెంట్ సుదర్శనం రామకృష్ణ, కోశాధికారి దేవి ప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లా లో ప్రమాదకర కర్మాగారాలను తనిఖీ

- డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాధాకృష్ణ



**కాకినాడ.పెన్ పవర్ జులై 10 :**కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఆదేశాల మేరకు జిల్లా లో ప్రమాదకర కర్మాగారాలను తనిఖీ చేయటము జరిగిందని డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం వాకలపూడి ఏరియా లో గల 1, మహతి స్టోరేజ్ టెర్మినల్ ,ఫోర్ట్ రోడ్డు, 2, ఐ ఎం సి లిమిటెడ్ వాకలపూడి లను ప్రమాదకర కర్మాగారాలను తనిఖీ చేయటము జరిగిందని,

ప్రమాదకర పదార్థాలు నిల్వ చేస్తున్న ట్యాంకులను పరిశీలించి, సెన్సర్స్ ఏర్పాటుగురించి,ఆపరేషన్ పద్ధతులు గురించి,మంటలు ఆర్పేందుకు ఫోం వ్యవస్థ గురించి సూచనలు ఇవ్వటము జరిగిందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.ఈ తనిఖీలు డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాధాకృష్ణ, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మురళీకృష్ణ , ఇతర సిబ్బంది , ఫ్యాక్టరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వెయిట్ లిఫ్టర్ మందపల్లి శ్రీనివాసరావు అభినందించిన కలెక్టర్

**కాకినాడ.పెన్ పవర్ జూలై 10 :**ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నం పెదగంట్యాడలో గత నెల 8వ తేదీ నుంచి 9వ తేది వరకు జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో డేట్ లిఫ్ట్ ఛాంపియన్ షిప్ లో 195 కేజీల విభాగంలో ఏపీఎస్ఆర్టీసీ కాకినాడ డిపో డ్రైవర్ గా పనిచేస్తున్న మందపల్లి శ్రీనివాసరావు ప్రథమ స్థానంలో నిలవడంతో గోల్డ్ మెడల్, ప్రశంస పత్రాన్ని పొందుకున్నారు. అదేవిధంగా పవర్ లిఫ్టింగ్ బ్యాక్ స్క్వాడ్ లో 180 కేజీల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించారు. ఈ నేపథ్యంలో ఆయన బుధవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవర్ గా పనిచేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణించడం ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా మందపల్లి శ్రీనివాసరావును జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించి,



శుభాకాంక్షలు తెలియజేశారు.

# రంగరాయ మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థుల ఔదార్యానికి అభినందనలు-ఎమ్మెల్యే కొండబాబు



**కాకినాడ.పెన్ పవర్ జులై 10 :**ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లా ప్రజలకు ఆరోగ్య ప్రధాయినిగా బాసిల్లుతున్న కాకినాడ ప్రభుత్వ సర్వజన సామాన్య ఆసుపత్రిలో పరిమితికి మించి రోగుల తాకిడి పెరుగుతున్న నేపధ్యంలో రోగులకు వైద్య సేవలు అందిం చడం కష్టతరంగా మారింది. 11వందల మంది రోగులకు ఇన్ పెషేంట్ గా జాయిన్ చేసుకుని వారికీ వైద్య సేవలు అండీంచెందుకు మాత్రమే సౌకర్యాలు కలిగి ఉన్న ఈ ఆసుపత్రిలో ప్రస్తుతం సుమారు 18వందల నుండి 2వేల వరకు రోగులకి వైద్యలు సేవలు అండీస్తున్నారు. ఇటువంటి నేపథ్యంలో కొన్ని సమయాల్లో రోగులు అసహనానికి గురవ్వుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. అయితే జిజిహేచ్ కు పెరుగుతున్న ఒత్తిడికి అనుగుణంగా 500 మంది రోగులకు సరిపడేవిధంగా ఆధునిక వసతి, పడకలు, మ్లోిక సదుపాయల కల్పనతో ప్రత్యేక విభాన్ని నిర్మించెందుకు ముందుకు వచ్చిన రాంకోనా కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ లో డాక్టర్ పట్టా పొంది అమెరికా లో స్థిరపడిన పూర్వ విద్యార్డులు తమ స్వంత నిధులు సమాకూర్చి నిర్మాణం చేయించడం అభినందనీయం అని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. బుధవారం ఆయన జీజీహేచ్ కు చేరుకొని సూపరిం టెండెంట్ ఎస్ లావణ్య కుమారి చాంబర్లో వైద్యలు, పరిపాలన అధికారులతో జిజిహేచ్ ప్రగతి, అభివృద్ధి పై సమీక్షించ్చారు. అనంతరం సూపరింటీండెంట్ లావణ్య కుమారితో కలిసి నిర్మాణం లో ఉన్న ఎం సి హెచ్ బ్లాక్ ను సందర్శించి నిర్మాణం పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మీడియా తో మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం కారణంగా అర్ధాంతరంగా ఆగిపోయిన ఈ బిల్డింగ్ ప్రవాస ఆంధ్రులైన రంగరాయ మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థులు తమ సొంత నిధులతో ఇంత పెద్ద భవనం నిర్మాణం చేపట్టడం పట్ల వారికున్న అభిమానం తెలియజేస్తుందన్నారు. వారు అమెరికా లో స్థిరపడినా తాము చదువుకున్న ఆసుపత్రి అభివృద్ధికి సాయం చేయాలనే దృక్పధం వారికి సమాజం పట్ల ఉన్న గౌరవాన్ని తెలియజేస్తుందన్నారు.ఈ బిల్డింగ్ నిర్మాణం పూర్తైతే మాతాశిశు విభాగంలో గర్భిణీలకు, బాలింతలకు మెరుగైన సేవలు అందించెందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎంతోమంది ఇతర జిల్లాల నుండి వైద్యం కోసం ఇక్కడికి వస్తున్నావారికి ఇంకా మంచి వైద్య సేవలు అందించడానికి దాతల అవసరం ఎంతైనా ఉందన్నారు. కూటమి ప్రభుత్వ విద్య, వైద్య రంగాలా అభివృద్ధికి ప్రధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సి ఎస్ ఆర్ ఎం ఓ డాక్టర్ అనిత, ఏ ఒ అనురాధ, డిప్యూటి కలెక్టర్ శ్రీధర్, ఇంజనీరింగ్ డి ఈ చక్రవర్తి, సివిల్ ఇంజనీర్ రాహుల్, వర్క్ షాప్ గ్రేడ్ 2 మెకానిక్ సురేంద్ర, రామ్కోనా ప్రతినిధులు డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ ఆనంద్, డాక్టర్ చిట్ల కిరణ్, కాంటాక్టర్ సురేష్, గోకేడ శ్రీరామ చంద్రమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీల సమస్యల పరిష్కరించాలి






**గంగవరం, పెన్ పవర్, జూలై 10:**దీర్ఘకాలికంగా పెండింగులో ఉన్న అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు కే రాణి డిమాండ్ చేశారు. డిమాండ్స్ డే ను పురస్కరించుకొని బుధవారం ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్వాడి సిబ్బంది గంగవరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి డిమాండ్స్ తో కూడిన వినతి పత్రాన్ని తాహసిల్దార్ సత్య సులోచన కు అందజేశారు ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్వాడీలకు కనీస వేతనం రూ 26,000 పెంచాలని, యాప్ ల భారం తగ్గించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ చేయాలని, రాజకీయ వేధింపులు నివారించాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచి గుర్తింపు కార్డులు యూనిఫాం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ పాల్గొన్నారు.

# ఆక్వా రైతులు మన ఆర్థిక నాయకులు

- స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ప్రిన్సిపాల్ సుమలత
- ఆదిత్య డిగ్రీ కళాశాలలో జాతీయ ఆక్వా రైతుల దినోత్సవం

**కాకినాడ.పెన్ పవర్ జులై 10 :**స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఫిషరీస్ అండ్ ఆక్వాకల్చర్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో జాతీ ఆక్వా రైతులు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ , పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు తెలిపారు. జాతీయ ఆక్వారైతుల దినోత్సవం ఆదిత్య డిగ్రీ కళాశాలలో జరిగింది. నీలి విప్లవ, భారతీయ జలచరాల పితామహుడు డాక్టర్ హీరాలాల్ చౌదరి చిత్రపటానికి పూలమాలలో వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ కోర్సులతో పాటు జీవశాస్త్రం మరియు ఫిషరీస్ డిపార్ట్మెంట్లకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఖర్చుకు వెనుకాడకుండా ఫిషరీస్ లేబరేటరీని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.

ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ప్రిన్సిపాల్ సుమలత

సుమలత మాట్లాడుతూ చేపల పెంపకందారులు, ఆక్వాకల్చర్ పరిశ్రమ నిపుణులు మరియు ఇతర వాటాదారుల అమూల్యమైన సహకారాన్ని గుర్తించి, ప్రశంసించడానికి ప్రతి సంవత్సరం జూలై 10వ తేదీన జాతీయ చేపల రైతు దినోత్సవాన్ని జరుపుకుంటారని అన్నారు. చేపల రైతులు మన ఆర్థిక నాయకులు అని అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఆదిత్య డిగ్రీ కళాశాల ఫిషరీస్ విభాగాన్ని అభినందించారు.గౌరవ అతిథిగా విచ్చేసిన నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ ఆక్వాకల్చర్ సీఈవో దయాహున్ ఖోంగ్లా మాట్లాడుతూ నీలి విప్లవంలో సాంకేతిక పద్ధతులను వివరించారు.కృత్రిమ మేధస్సు ను ఉపయోగించి ఆక్వా ఉత్పత్తిని పెంచే విధానాలను వివరించారు.ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ డిపార్ట్మెంట్ రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ పి. రామమోహనరావు మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదిలో పాఠాలతో పాటు క్షేత్ర పర్యటన ద్వారా మరిన్ని విషయాలు తెలుసుకోవాలని, ఫిషరీస్ చదువుతున్న విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందని అన్నారు.

ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఫిషరీస్ విభాగాన్ని ఆదిత్య




విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణ రెడ్డి అభినందించారు.ఈ కార్యక్రమంలో సి.ఐ. ఎఫ్. ఇ సైంటిస్ట్ డాక్టర్ శ్యామల, ఎస్ కే బి ఆర్ డిగ్రీ కళాశాల జువాలజీ, ఆక్వాకల్చర్ లెక్చరర్ డాక్టర్ పి. సాయిబాబా, జిల్లా స్థాయి కమిటీ సభ్యులు సూర్యారావు దొర , ఎస్ జి ఎస్ ఆక్వా సొల్యూషన్స్ పారిశ్రామికవేత్త మధు తాళ్లూరి , ఆదిత్య డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇంచార్జ్ ఎన్ మూర్తి, ఆదిత్య డిగ్రీ కళాశాల ఫిషరీస్ డిపార్ట్మెంట్ విభాగాధిపతి డాక్టర్ కె నరసింహమూర్తి,అధ్యాపకులు మహమ్మద్ అలీ, జీవశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ బి శ్రీను , అనిల్, అనూష, హర్షిత, విద్యార్థులు పాల్గొన్నారు.